# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 232 | ఆదివారం 3 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# అంగన్వాడీ కేంద్రాలపై నిఘా

## అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు

- మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- అంగన్వాడీల్లో గర్భిణీలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలి
- పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలి
- కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలి
- అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టి

హైదరాబాద్

మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల్లో గర్భిణీలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశించారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలని -మిగతా3లో



# కాళేశ్వరం ప్రాజెక్టు సురక్షితం కాదు

- కేసీఆర్ క్షమాపణ చెప్పాలి మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్
- లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, భూపాలపల్లి ప్రాంతాల్లో ఒక్క చుక్క నీరు రాలేదని విమర్శ
- మేడిగడ్డకు మరమ్మతులు నిపుణుల సూచనల మేరకు జరుగుతాయన్న మంత్రి
- ఎవరి సలహాలపైనో మరమ్మతులు చేపడితే ప్రాజెక్టు మళ్లీ కుంగిపోతుందన్న శ్రీధర్

పెద్దపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టు సురక్షితం కాదని తాము మాత్రమే కాదని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులే చెప్పారని... దీనికి రూప కల్పన చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో శనివారం ఆయన గృహజ్యోతి -మిగతా3లో

# తెలంగాణలో మెజార్టీ సీట్లు సాధిస్తాం



- ఎన్నికల మేనిఫెస్టో కోసం ప్రజల నుంచి సలహాలు తీసుకుంటాం
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లకు పైగా గెలుస్తుంది
- విజయ సంకల్ప యాత్రతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది
- మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి వస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డి
- కేసీఆర్ ఆ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారు...
- రేవంత్ రెడ్డి ప్రధానికి స్వాగతం పలుకుతారని భావిస్తున్నాం: కిషన్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ మెజార్టీ సీట్లలో విజయం సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన అభివృద్ధి భారతావనికి మోదీ గ్యారంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టో కోసం ప్రజల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370 సీట్లకు పైగా గెలుస్తుందని తెలిపారు. విజయ సంకల్ప యాత్రతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండిందని చెప్పారు. మోదీ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి వస్తామని చెప్పారు. -మిగతా3లో

# లోక్ సభ ఎన్నికలకు 195 మందితో బీజేపీ తొలి జాబితా విడుదల



- బీజేపీ ఫస్ట్ లిస్ట్‌లో బండి సంజయ్, ఈటల రాజేందర్, మాధవీలత...
- సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్‌లకు మరోసారి అవకాశం
- చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి టిక్కెట్ ఇచ్చిన బీజేపీ అధిష్ఠానం
- బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన బీబీ పాటిల్‌కు జహీరాబాద్ టిక్కెట్

-2లో



## రాహుల్ గాంధీకి నిరసన సెగ!

- ఇటీవలే 'భారత్ జోడో న్యాయ యాత్ర'కు బ్రేక్ ఇచ్చి లండన్ పర్యటనకు వెళ్లిన రాహుల్
- ఖలీస్థానీ అనుకూల సిక్కుల నుంచి నిరసన సెగ తగిలినట్లు సమాచారం
- బిజినెస్ స్కూల్ అధికారుల జోక్యంతో నిరసన అదుపులోకి వచ్చినట్లు సమాచారం

# హరీశ్‌రావు కూడా బీజేపీలోకి పోతాడు

- ఫ్లోర్ లీడర్ పదవి ఇవ్వకుంటే హరీశ్ రావు బీజేపీలోకి వెళతారు
- మంత్రి కోమటిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- కేటీఆర్ ఇప్పటికీ తండ్రి చాటు కొడుకేనని ఎద్దేవా
- మేం తెచ్చిన జీరో బిల్లులా కేటీఆర్ నాలెడ్జ్ జీరో అని చురక
- ఇక నుంచి యాదాద్రి కాదు... యాదగిరిగుట్ట అన్న మంత్రి కోమటిరెడ్డి
- రాహుల్ గాంధీని నల్గొండ నుంచి పోటీ చేయమని కోరినట్లు వెల్లడి
- ప్రధాని మోదీ కంటే రాహుల్ గాంధీకే అత్యధిక మెజార్టీ వస్తుందని ధీమా



నల్లగొండ

ఫ్లోర్ లీడర్ పదవి ఇవ్వకపోతే హరీశ్ రావు బీజేపీలోకి వెళతారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... కేటీఆర్ ఇప్పటికీ తండ్రి చాటు కొడుకేనని ఎద్దేవా చేశారు. తాను కేటీఆర్ మాదిరిగా తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి రాలేదని, ఉద్యమాలు చేసి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. తాము ప్రజల కోసం ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా జీరో బిల్లు ఇచ్చామని, అలాగే కేటీఆర్‌కు నాలెడ్జ్ జీరో అని చురక అంటించారు. ఏమాత్రం నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడుకోవడం వృథా అన్నారు. 'ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పటికీ తండ్రి కేసీఆర్ చాటు కొడుకే. నేను ఉద్యమాలు చేసి వచ్చాను. మేం జీరో బిల్ ఇచ్చినట్టు.. కేటీఆర్‌కి జీరో నాలెడ్జ్ ఉంది. నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడడం వృథా. ఫ్లోర్ లీడర్ ఇవ్వకపోతే హరీష్ కూడా బీజేపీలోకి పోతాడు. కాళేశ్వరం కట్టిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ మేడిగడ్డ ఎందుకు పోలేదు?. కాళేశ్వరం పనికిరాదని ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ ఇచ్చింది. ప్రజలే కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేశారు. ఎంపీ అభ్యర్థులపై అంతర్గత సర్వే జరుగుతోంది. భువనగిరి నుండి పోటీ చేయమని రాహుల్ గాంధీని కోరాను. భువనగిరి, ఖమ్మం, నల్గొండలో.. దక్షిణాదిలో టాప్ మెజార్టీ వస్తుంది. మోదీ కంటే రాహుల్ గాంధీ ఎక్కువ మెజారిటీతో గెలుస్తారు' -మిగతా3లో

# టీఎంసీ అంటేనే అవినీతి



- టీఎంసీ అంటే 'తూ, మైన్ ఔర్ కరప్షన్
- రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధిస్తుంది
- టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోపిడీకి ప్రతిరూపం
- బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు

# భారతదేశం రెండు ముక్కలు కానుందా?



హిమాలయ పర్వత శ్రేణికి దిగువన భారత, యురేషియా ఖండాంతర టెక్టోనిక్ ప్లేట్లు పరస్పరం ఢీకొంటున్న కారణంగా హిమాలయాలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు ఏనాడో గుర్తించారు. అయితే ఇండియన్ ప్లేట్‌లోని కొంత భాగం యురేషియన్ ప్లేట్ కింద జారిపోతున్నందున అది 'డీలామినేట్' అవుతున్నదని పరిశోధకులు తాజాగా కనుగొన్నారు. ఈ ప్రక్రియ భారత్‌ను బౌగోళికంగా విభజించే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

సాధారణంగా రెండు టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొన్నప్పుడు, ఒకదాని కిందకు మరొకటి కిందకి జారిపోతుంది. ఈ ప్రక్రియను సబ్‌డక్షన్ అంటారు. రెండు ఖండాంతర పలకలు సమానంగా ఉన్నందున, భూవిజ్ఞాన శాస్త్రవేత్తలకు ఏ ప్లేట్ మరొకదానిపై అతివ్యాప్తి చెందుతుందో ఖచ్చితంగా గుర్తించలేరు. ఇండియన్ ప్లేట్‌లోని దట్టమైన దిగువ భాగం పై భాగానికి దూరంగా ఉంటుంది. వీటిమధ్య నిలువుగా ఏర్పడిన పగులును శాస్త్రవేత్తలు గుర్తించారు. భారత– యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య 60 మిలియన్ సంవత్సరాలకు పైగా జరుగుతున్న ఘర్షణ హిమాలయాలకు ఇప్పుడు మనం చూస్తున్న ఆకృతినిచ్చింది. సముద్రపు పలకల వలె కాకుండా, ఖండాంతర పలకలు మందంగా, తేలికగా ఉంటాయి, అవి భూమిలోని మాంటిల్‌లోకి సులభంగా ఇమిడిపోవు. భౌగోళిక భౌతిక శాస్త్రవేత్తల అంతర్జాతీయ బృందం ఇటీవల టిబెట్ భాభూగం కింది భూకంప తరంగాలను విశ్లేషించింది. ఈ నేపథ్యంలో యురేషియన్ ప్లేట్ దాని కింద జారిపోతున్నందున భారత ప్లేట్ విచ్ఛిన్నమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపింది. ఈ బృదం యురేషియన్ ప్లేట్ మధ్య సరిహద్దు వద్ద పగుళ్లను కూడా కనుగొంది. భూకంప తరంగాలు, హీలియం వాయువులు ఉపరితలంపైకి చొచ్చుకు రావడం ఈ డీలామినేషన్ ప్రక్రియకు సాక్ష్యంగా నిలుస్తున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నూతన పరిశోధనా ఫలితాలు మునుపటి పరికల్పనలను సవాలు చేస్తున్నాయి. భౌగోళిక ప్రక్రియలను మరింతగా గుర్తించేలా చేస్తున్నాయి. ఇన్నాళ్లూ పరిశోధకులు ఖండాలు ఏర్పడటం వెనుక ఇటువంటి ప్రక్రియ ఉంటుందనే దానిపై పరిశోధనలు సాగించలేదు. అయితే ఈ కొత్త అధ్యయనం మరిన్ని నూతన ఆవిష్కరణలకు నాంది పలకనుంది. ఈ పరిశోధన అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ వార్షిక సమావేశంలో సమర్పించారు. ఇది హిమాలయాల ఆవిర్భావాన్ని మరింతగా అర్థం చేసుకోవడంలో సహాయపడనుంది.అలాగే భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూకంప ప్రమాదాలను పసిగట్టేందుకు సహాయకారిగానూ ఉండవచ్చు.

# అందుకే క్రాస్ ఓటేశాం.. మరో 9 మంది రెడీగా ఉన్నారు



**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి క్రాస్ ఓటు వేసిన విషయం తెలిసిందే. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్య ఓట్లు టై కావటంతో టాస్ వేసి ఫలితాలు ప్రకటించారు. ఈ అనూహ్య పరిణామాల నడుమ బీజేపీ అభ్యర్థి హర్ష మహాజన్ గెలుపొందారు. అయితే సర్కార్ కూలిపోయే అవకాశాలు కనిపించడంతో.. ఆ వెంటనే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఆరుగురు ఎమ్మెల్యేలపై ఆ రాష్ట్ర స్పీకర్ అనర్హత వేటు వేశారు. తాజాగా ఈ మొత్తం పరిణామాలపై రెబల్ ఎమ్మెల్యేలు స్పందించారు. ఎమ్మెల్యే రాజేంద్ర రానా క్రాస్ ఓటింగ్ విషయంపై మాట్లాడుతూ.. 'హిమాచల్ ప్రదేశ్ ప్రజలపై ఉన్న గౌరవం, మర్యాద ప్రకారం మేం క్రాస్ ఓటు నిర్ణయం తీసుకున్నాం. హిమాచల్ ప్రదేశ్‌కు దేవభూమిగా పేరుంది. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నిలపడానికి ఇంకా ఎవరూ లేరా?. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు కాంగ్రెస్‌కి కనిపించలేదా?. అసలు హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎవరూ ప్రాతినిధ్యం వహించాలి?' అని రాజేంద్ర రానా ప్రశ్నించారు. 'మేము కోర్టుకు వెళ్తాం. తీవ్రమైన ఒత్తిడి కారణంగా స్పీకర్ మాపై అనర్హత వేటు వేశారు. పోలీసు మా అనుచరులకు చలాన్లు జారీ చేయటం మొదలుపెట్టారు. మేము రాష్ట్రం ఆత్మాభిమానాన్ని రక్షిస్తాం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కేవలం సుఖ్విందర్ సింగ్ సుఖు స్నేహితుల ప్రభుత్వం. ప్రతిఒక్కరికి రాష్ట్ర పరిస్థితి ఏంటో తెలుసు. యువత ఉద్యోగ పరీక్షలు రాసి రోడ్లమీద ఉన్నారు. వారు ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం లేదు. కొంత మంది ఎమ్మెల్యేలను అవమాన పరుస్తున్నారు. మరో తొమ్మిది మంది మా వెంట వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు' అని రాజేంద్ర రానా అన్నారు.

## గంభీర్ బాటలో.. ఎన్నికలకు దూరంగా కేంద్ర మాజీ మంత్రి



**ఢిల్లీ:** బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని.. రాజకీయాల నుంచి వైదొలగానుకుంటున్నట్లు గౌతం గంభీర్ ప్రకటించిన వేళ.. మరోనేత అదే రీతిన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ సీనియర్.. ఎంపీ జయంత్ సిన్హా వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. జయంత్ సిన్హా.. గతంలో కేంద్ర మంత్రి గానూ పని చేశారు. ప్రస్తుతం ఆయన జార?ండ్‌లోని హజారీబాగ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 'నన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతున్నా. నేను ప్రపంచ పర్యావరణ మార్పుల విషయంలో భారత్‌పై పూర్తి దృష్టి సారించాలనుకుంటున్నా. నేను ఆర్థిక, ప్రభుత్వపరమైన విషయాల్లో బీజేపీ పార్టీకి అన్ని రకాలుగా సేవలందిస్తా. .. గత పదేళ్లుగా హజారీబాగ్‌కు సేవలు అందించినందుకు గర్వపడుతున్నా. ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ నాయకత్వం ఆశీస్సులతో చాలా మంచి అవకాశాలు పొందాను. వారందరికీ నా కృతజ్ఞతలు. జైహింద్' అని జయంత్ సిన్హా ఎక్స్( ట్విటర్) వేదికగా ప్రకటించారు. ఐఏఎస్ మాజీ అధికారి.. కేంద్ర మాజీ మం?త్రి యశ్వంత్ సిన్హా కుమారుడే జయంత్ సిన్హా అని తెలిసిందే. సుదీర్ఘకాలం బీజేపీతో రాజకీయాల్లో ఉన్న యశ్వంత్ సిన్హా.. తీవ్ర విమర్శలు గుప్పిస్తూ పార్టీని వీడారు. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. 2022లో రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షల తరఫున అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇలా ఇద్దరూ సిట్టింగ్ ఎంపీలు తాము వచ్చే లోకసభ ఎన్నికల్లో పోటీ చేయమని.. రాజకీయాలకు దూరం ఉంటామని ప్రకటించటం బీజేపీలో చర్చనీయాంశంగా మారింది. అయితే మరోవైపు బీజేపీ ప్రకటించే ఎంపీ అభ్యర్థుల జాబితాలో వీరికి టికెట్ లభించకపోవచ్చని కూడా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకేవారు రాజకీయాలకు దూరంగా ఉండాలని వారు ఇలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక..బీజేపీ మొదటి జాబితాలోనే సుమారు వంద మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నట్లు వార్తలు వస్తున్నాయ. ఆ దిశగా బీజేపీ రెండు రోజులుగా తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే.

## గూగుల్ చర్యను అనుమతించలేము..
# యాప్స్ తొలగింపుపై కేంద్రం





గూగుల్ తన ప్లే స్టోర్ నుంచి 10 భారతీయ యాప్‌లను తొలగించే చర్యను అనుమతించలేమని కేంద్రం తెలిపింది. టెక్ కంపెనీ, సంబంధిత స్టార్టప్‌ల ప్రతినిధులను సోమవారం (మార్చి 4) రావాలని ఐటి మంత్రి 'అశ్విని వైష్ణవ్' ఆహ్వానించారు. సర్వీస్ ఫీజు చెల్లింపులపై వివాదాలను పేర్కొంటూ గూగుల్ నిన్న (మార్చి 1) భారతీయ కంపెనీల యాప్‌లను తొలగించడానికి సిద్ధమైంది. ఇందులో మాట్రిమోనీ.కామ్, షాదీ.కామ్, ఇన్ఫోఎడ్జ్, అన్‌అకాడమీ, ఆహా, డిస్నీ హాట్‌స్టార్, ట్రూలీ మ్యాడ్లీ, క్వాక్‌క్వాక్, స్టేజ్, కుటుంబ్, టెస్ట్‌బుక్ ఉన్నాయి. అయితే గూగుల్ చేపట్టిన ఈ చర్యకు కంపెనీలు అసహనం వ్యక్తం చేశాయి. అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని, గూగుల్ అధికారులతో చర్చ జరిపిన తరువాత సానుకూలమైన ఫలితం రావచ్చని, తప్పకుండా ఈ కంపెనీలను రక్షించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి 'అశ్విని వైష్ణవ్' వెల్లడించారు. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన మాట్రిమోని.కమ్, భారత్ మాట్రిమోని, జోడి వంటి యాప్స్ వ్యవస్థాపకుడు 'మురుగవేల్ జానకిరామన్' గూగుల్ చర్యపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ యాప్ సంభావ్యతను వివరిస్తూ.. భారతదేశ ఇంటర్నెట్‌కు ఇది చీకటి రోజుగా పేర్కొన్నారు. ఒక్క భారత్ మ్యాట్రిమోని మాత్రమే 50 మిలియన్లకు పైగా డౌన్‌లోడ్‌లను కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా యాప్ డెవలపర్లు నిబంధలను ఉల్లగించినట్లు, ఈ కారణంగానే ఆ యాప్‌లను తొలగించనున్నట్లు స్పష్టం చేసింది. ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా భారతీయ మార్కెట్‌లో 94 శాతం వాటాను కలిగి ఉన్న టెక్ దిగ్గజం త్వరలో ఐటి మంత్రిని కలిసిన తరువాత ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందనేది తెలుస్తుంది.

# టీఎంసీ అంటేనే అవినీతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతిపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. నదియా జిల్లాలోని క్రిష్ణనగర్‌లో శనివారం జరిగిన విజయ సంకల్ప సభలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన టీఎంసీ అంటే 'తూ, మైన్ ఔర్ కరప్షన్ (నువ్వు, నేను ఇంకా అవినీతి)' అని అభివర్ణించారు. సభకు వచ్చిన మిమ్మల్నందరినీ చూస్తుంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400కు పైగా లోక్‌సభ స్థానాలు గెలువడం ఖాయమనిపిస్తోందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విమర్శలు చేశారు. బెంగాల్‌లో మొత్తం 42 సిట్లతో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో టీఎంసీని ప్రధాని మోదీ టార్గెట్ చేశారు. ఆయన శనివారం బెంగాల్‌లోని కృష్ణనగర్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. 'టీఎంసీ అంటేనే అవినీతి. ఇక్కడికి వచ్చిన ప్రజలు ఇచ్చిన విశ్వాసంతో చెబుతున్నా.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కార్ 400 స్థానాల్లో విజయం సాధింస్తుంది. టీఎంసీ అంటే దౌర్జన్యాలు, కుటుంబ రాజకీయం, దోహానికి ప్రతిరూపం. బెంగాల్ ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పట్ల విసుగు చెందారు.

సందేశ్‌ఖాలీ మహిళల విషయాన్ని ప్రస్తావిస్తూ... టీఎంసీ నేతలు సందేశ్‌ఖాలీ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని అన్నారు. బాధలో ఉన్న తల్లులు సోదరీమణులకు మద్దతు ఇవ్వాల్సింది పో?యి టీఎంసీ ప్రభుత్వం నిందితుల పక్షాన నిలబడుతోందని మోదీ విమర్శించారు. న్యాయం కోసం సందేశ్‌ఖాలీ మహిళలు ఎంత వేడుకుంటున్నా, నిరసనలు తెలిపినా టీఎంసీ ప్రభుత్వం మాత్రం వినిపించుకోలేదని మోదీ మండిపడ్డారు. అలాగే సందేశ్‌ఖాలి ఉదంతాన్ని ప్రధాని మోదీ లేవనెత్తారు. రాష్ట్రంలో మహిళలకు అండగా నిలువాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని తల్లులు, చెల్లెల్లు న్యాయం కోసం అభ్యర్థిస్తుంటే ప్రభుత్వం వారి గోడును వినిపించుకోవడం లేదని మండిపడ్డారు. మహిళల సంక్షేమం పేరుతో ఓట్లు గుంజిన టీఎంసీ ఇప్పుడు మహిళలను ఏడిపిస్తోందని అన్నారు.

## నాలుక మడతేసి..
## ప్రత్యర్థులకు మళ్లీ దొరికిన ప్రెసిడెంట్



**వాషింగ్టన్:** బైడెన్ మళ్లీ నాలుక మడతేశారు. ఒకటి చెప్పాలనుకుని మరొకటి చెప్పి ఎన్నికల వేళ రాజకీయ ప్రత్యర్థులకు మళ్లీ దొరికిపోయారు. నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించిన ప్రైమరీ బ్యాలెట్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. డెమొక్రాట్ల తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో బైడెన్ ముందున్నారు. అయితే బైడెన్ వయసు చాలా ఎక్కువని, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించేందుకు ఆయన పనికిరారని ప్రత్యర్థులతో పాటు సొంత పార్టీ డెమొక్రాట్లలో కూడా కొందరు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో బైడెన్ తన మతిమరుపు, వృద్ధాప్యాన్ని మళ్లీ మళ్లీ బయటపెట్టుకోవడం ఆయన ప్రత్యర్థులకు ఆయుధంగా మారుతోంది. తాజాగా శుక్రవారం ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో వైట్‌హౌజ్‌లో బైడెన్ సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా ఇక నుంచి పాలస్తీనాలోని గాజాలో ఆహారపొట్లాలు విమానాల ద్వారా జారవిడుస్తుందని చెప్పబోయి ఉక్రెయిన్‌కు ఆహారం సప్లై చేస్తామని స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే అది ఉక్రెయిన్ కాదని, గాజా అని కొద్దిసేపటి తర్వాత వైట్‌హౌజ్ క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. గత నెల మొదటి వారంలో కూడా ఈజిప్ట్ ప్రధాని అబ్దిల్ ఫట్టా పేరును ప్రస్తావిస్తూ ఆయనను మెక్సికో అధ్యక్షుడిగా పేర్కొనడం విమర్శలకు దారి తీసింది. అయితే బైడెన్ డాక్టర్లు మాత్రం ఆయన అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించేందుకు అవసరమైన ఫిట్‌నెస్‌తో ఉన్నారని స్పష్టం చేయడం గమనార్హం.

## రాహుల్ గాంధీకి నిరసన సెగ!



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాను చేపట్టిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'కు బ్రేక్ ఇచ్చి ఇటీవల లండన్ పర్యటించారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించడానికి వెళ్లారు. అయితే రాహుల్ గాంధీకి జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో ఖలీస్థానీ అనుకూల సిక్కుల నుంచి నిరసన సెగ తగిలినట్లు తెలుస్తోంది. అయితే బిజినెస్ స్కూల్ అధికారుల జోక్యంతో నిరసన అదుపలోకి వచ్చినట్లు సమాచారం. ఈ విషయంపై స్పందించిన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పోలీసులు.. ఖలీస్థానీ అనుకూల సిక్కు నిరసనకారులను జడ్జ్ బిజినెస్ స్కూల్‌లోకి తాము అనుమతించలేదని పేర్కొనటం గమనార్హం. పరమజిత్ సింగ్ పమ్మా ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై నిరసన తెలిపినట్లు యూకే పోలీసులు తెలిపారు. పరమజిత్ సింగ్ పమ్మా.. యూరప్‌లోని సిక్ ఫర్ జస్టిస్ సంస్థ కో–ఆర్డినేటర్. 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లు, అమృత్‌సర్ హత్యలకు కారణం గాంధీ కుంటుంబమేనంటూ నిరసన తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. రాహుల్ గాంధీ చేపట్టే పలు విదేశి పర్యటనల్లో సైతం ఆయన తమ నిరసన తప్పించుకోలేరని నిరసనకారులు సవాల్ చేసినట్లు తెలుస్తోంది. ఇక.. ఖలీస్థానీ అనుకూల సిక్కుల నిరసన నేపథ్యంలో రాహుల్ గాంధీ ?ప్రసంగం అనతంరం.. యూకే పోలీసులు కల్పించిన పటిష్టమైన భద్రత నడుమ యూనివర్సిటీ నుంచి బయటకు రాగలిగినట్లు తెలిసింది. అయితే ఈ నిరసన ఘటనపై ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెల్లడికాలేదు.

## 26/11 దాడుల ప్రధాన సూత్రధారి పాకిస్థాన్‌లో మృతి



**ఇస్లామాబాద్:** భారత్‌కు పీడకలగా మిగిలిపోయిన 2008 ముంబై దాడుల(26/11) ప్రధాన సూత్రధారి, లష్కర్ ఏ తాయిబా సీనియర్ కమాండర్ అజమ్ ఛీమా గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్‌లో ఛీమా మరణించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఇతడి అంత్యక్రియలు ఫైసలాబాద్‌లోని మల్కన్‌వాలాలో పూర్తయ్యాయి. కేవలం 26/11 దాడులే కాకుండా 2006లో ముంబైలోనే 188 మంది మృతికి కారణమైన రైళ్లలో బాంబు పేలుళ్ల వెనుక ప్రధాన కుట్రదారుడు ఛీమాయేనని అప్పట్లో తేల్చారు. ఈ పేలుళ్లలో 800 మంది దాకా గాయపడ్డారు. అజమ్ ఛీమా అమెరికా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలోనూ ఉన్నాడు. కాగా, 2008 నవంబర్ 26న ముంబైలో జరిగిన ఉగ్ర దాడుల్లో మొత్తం 10 మంది పాకిస్థాన్ టెర్రరిస్టులు పాల్గొన్నారు. వీరు సముద్ర మార్గం ద్వారా అక్రమంగా దక్షిణ ముంబైలోకి ప్రవేశించి తాజజ్ మహల్ ప్యాలెస్ హొటల్‌తో పాటు నగరంలోని పలు రద్దీ ప్రాంతాల్లో విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 18 మంది పోలీసులతో పాటు మొత్తం 166 మంది గాయపడ్డారు. మృతి చెందిన వారిలో ఆరుగురు అమెరికన్లు ఉండటంతో ఛీమా పేరను అమెరికా తన మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో చేర్చింది.

## 'ఎక్కడికి వెళ్లను ఇక మీతోనే ఉంటా..' సీఎం నితీశ్ మాటలతో ప్రధాని మోదీ నవ్వులు



**పట్నా:** తాను ఇక పార్టీలు మారబోనని బీజేపీ–ఎన్డీయే కూటమిలో ఉంటానని బిహార్ సీఎం నితీష్‌కుమార్.. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మాటిచ్చారు. నితీష్ మాటలతో వేదికపై ఉన్న ప్రధాని మోదీ సహా పలువురు నేతలు పగలబడి నవ్వారు. బిహార్‌లోని ఔరంగాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. 'మీరు(మోదీ) త్వరగా వచ్చారు. లేకపోతే నేను పూర్తిగా మాయమయ్యే వాడిని. కానీ, నేను మీతో( మోదీ) ఉన్నా. నేను మీకు హామీ ఇస్తున్నా నేను ఏ కూటమిలోకి మారబోను. నేను మీతోనే ఉంటాను' అని సీఎం నితీష్ కుమార్ అన్నారు. నితీష్ కుమార్.. బిహార్‌లోని మహాకూటమి నుంచి బయటకు వచ్చి బీజేపీ ఎన్డీయే కూటమిలో చేరిన విషయం తెలిసిందే. జనవరిలోని నితీష్ కుమార్ బీజేపీ కూటమి మద్దతుతో తొమ్మిదోసారి సీఎం ప్రమాణం చేశారు. నితీష్ కుమార్ తిరిగి ఎన్డీయేలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ బీహార్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇక.. రూ. 4,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించేందుకు ప్రధాని మోదీ బిహార్‌లో పర్యటించారు.

# ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏ విస్తరణ

హైదరాబాద్ మెట్రోపాలిటన్ సిటీ పరిధిని ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన నేపథ్యంలో జీవో 111 అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. జంట జలాశయాల పరిరక్షణ కోసం అమల్లోకి తెచ్చిన ఈ జీవో ఇప్పటికే అన్ని విధాలుగా నిర్వీర్యమైంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు మహానగర విస్తరణ చేపట్టనున్న దృష్ట్యా జీవో 111పైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ముందుకెళ్లనుందనేది ఆసక్తికరంగా మారింది. రీజనల్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న అన్ని ప్రాంతాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తేనున్నట్లు సీఎం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకనుగుణంగా మెగా మాస్టర్ ప్లాన్-2050 రూపొందించాలని ఆయన హెచ్ఎండీఏను ఆదేశించారు. దీంతో ట్రిపుల్ వన్ పరిధిలోని 82 గ్రామాలను మెగా మాస్టర్ ప్లాన్‌లో విలీనం చేస్తారా, లేక ట్రిబుల్ వన్ జీవోను యధాతథంగా కొనసాగిస్తారా అనే అంశంపైన సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌తోపాటు, సైబరాబాద్, పాత ఎంసీహెచ్, ఎయిర్‌పోర్టు, జీహెచ్ఎంసీ మాస్టర్‌ప్లాన్‌లు అమల్లో ఉన్నాయి. ఈ ఐదింటిని కలిపి ఒకే బృహత్తర మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని, ట్రిపుల్ వన్‌లోని ప్రాంతాలను కూడా మాస్టర్‌ప్లాన్ పరిధిలోకి తేవాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఈ మేరకు అప్పట్లో ట్రిపుల్ వన్ జీవోను ఎత్తివేశారు. కానీ హైకోర్టు ఆదేశాలతో తిరిగి యదాతథస్థితి కల్పించవలసి వచ్చింది. ఈ క్రమంలో బృహత్తర మాస్టర్‌ప్లాన్‌పైన హెచ్ఎండీఏ ఇప్పటికే కసరత్తు చేపట్టింది. కానీ తాజా ప్రతిపాదనల మేరకు మెగా మాస్టర్‌ప్లాన్-2050పైన దృష్టి సారించింది. ప్రస్తుతం ఉన్న 7000 చదరపు కిలోమీటర్ల హెచ్ఎండీఏ పరిధిని మరో 3000 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరిస్తూ భారీ మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తే ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్న ట్రిపుల్ వన్ జీవోలోకి వచ్చే 82 గ్రామాల్లో ఉన్న సుమారు 1.30 లక్షల ఎకరాల భూమి కూడా ఈ మాస్టర్‌ప్లాన్‌లో భాగం కానుంది.



**పరిరక్షణపై నీలినీడలు...**

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల పరివాహక ప్రాంతాలను కాపాడేందుకు 1996లో ప్రభుత్వం జీవో 111ను అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిలోని 82 గ్రామాలు ఈ జీవో పరిధిలో ఉన్నాయి. సుమారు 1.30 లక్షల ఎకరాల భూమి విస్తరించింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏదో ఒక స్థాయిలో ఈ జీవో చర్చనీయాంశమవుతూనే ఉంది. మరోవైపు జీవోను పటిష్ఠంగా అమలు చేయాలని కోరుతూ పర్యావరణ సంస్థలు, సామాజిక కార్యకర్తలు న్యాయస్థానాల్లో పోరాడుతున్నారు. జీవోకు విఘాతం కలిగించే చర్యలపైన కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే గత ప్రభుత్వం మరోసారి ఈ జీవోను కదిలించింది. 82 గ్రామాలకు చెందిన రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ జీవోను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దాని స్థానంలో జీవో 69ను కూడా తెచ్చారు. కానీ న్యాయస్థానంలో జీవో 111 అమల్లోనే ఉన్నట్లు ప్రభు త్వం స్పష్టతనివ్వడంతో తీవ్రమైన సందిగ్ధం కొనసాగుతుంది. ఈ క్రమంలోనే ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

**భారీగా అక్రమ నిర్మాణాలు...**

ఒకవైపు ఇలా వివిధ రకాలుగా ట్రిపుల్ వన్ జీవోను నిర్వీర్యమవుతున్న పరిస్థితుల్లోనే అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వట్టినాగులపల్లి, పుప్పాలగూడ, తదితర ప్రాంతాల్లో అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోనే అడ్డగోలుగా చేంజ్ ఆఫ్ లాండ్ యూజ్ సర్టిఫికెట్లను ఇచ్చేశారు. మరోవైపు రియల్ఎస్టేట్ వర్గాలు, నిర్మాణ సంస్థలు భారీగా అక్రమ నిర్మాణాలు చేపట్టాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వరకు ఈ అక్రమ నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. శంషాబాద్, శంకర్‌పల్లి, తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో బహుళ అంతస్థుల భవనాలు వెలిశాయి. 'శంషాబాద్ పరిధిలోని శాతంరాయి, పెద్ద తుప్రా, ముచ్చింతల్ వంటి ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్డింగ్‌లు నిర్మిస్తున్నారు. ఆ తరువాత అనుమతులు తీసుకుంటున్నారు.' అని శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఒక అధికారి విస్మయం వ్యక్తం చేశారు.

**ఏం చేస్తారు...**

ఇలా అన్ని విధాలుగా జీవో 111 ప్రమాదంలో పడిన దృష్ట్యా మెగామాస్టర్ ప్లాన్‌పైన అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కన్జర్వేషన్ జోన్‌లో ఉన్న ప్రాంతాలను అలాగే ఉంచి మిగతా ప్రాంతాలకు మాస్టర్‌ప్లాన్ విస్తరిస్తారా లేక, ఈ జీవోలోని గ్రామాల కోసం ప్రత్యేకమైన మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారా అనే అంశాలు ఇప్పుడు చర్చనీయంగా మారాయి. మరోవైపు మెగా మాస్టర్‌ప్లాన్ ఎప్పటి వరకు రూపొందిస్తారనేది కూడా చర్చనీయాంశమే. ట్రిపుల్ ఆర్ వరకు నిర్మాణ రంగానికి అనుమతులపైన కూడా మాస్టర్‌ప్లాన్‌లో ఏ ప్రమాణాలను పాటిస్తారనేది కూడా తాజాగా ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం డీటీసీపీ పరిధిలో ఉన్న ప్రాంతాలు భవిష్యత్తులో హెచ్ఎండీఏ పరిధిలోకి రానున్నాయి. దీంతో భవన నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతులు తప్పనిసరి. అలాంటప్పుడు వివిధ రకాల జోన్‌ల విభజనపైన కూడా మాస్టర్‌ప్లాన్‌లో ఎలా ముందుకెళ్తారనేది కూడా రియల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ప్రజావాణి కార్యక్రమంలో ఈ సమస్యలపైనే ఎక్కువ దరఖాస్తులు

**ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరఖాస్తులు**
**ఉద్యోగ సంఘాల నుండి ఎక్కువ దరఖాస్తులు**
**రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 275 దరఖాస్తులు, రేషన్ కార్డుల కొరకు 107**
**ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 275 దరఖాస్తులు, రేషన్ కార్డుల కొరకు 107, ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 దరఖాస్తులు ఉన్నాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, సిడియంఎ దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు.



హైదరాబాద్, మార్చి 02: మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్?లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 1509 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 275 దరఖాస్తులు, రేషన్ కార్డుల కొరకు 107, ఇందిరమ్మ ఇండ్ల కోసం 396 దరఖాస్తులు ఉన్నాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, సిడియంఎ దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. కేవలం వ్యక్తిగత దరఖాస్తులే కాకుండా వివిధ ఉద్యోగ సంఘాల నుండి కూడా దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అందులో ముఖ్యంగా డిఎస్‌సి 2008 బిఈడీ మెరిట్ అభ్యర్థుల సంఘం నాయకులు శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర తీర్పు అమలు చేసి డిఎస్‌సి 2008 నోటిఫికేషన్ ప్రకారం కామన్ మెరిట్‌లో సెలక్ట్ అయ్యి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరారు. వారి సమస్యను విని సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు బోధన చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్ల సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు విద్యాభోదన చేస్తున్న తమ పోస్టులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు. అధిక సంఖ్యలో విజ్ఞాపనలు వస్తున్నందున వాటిని పరిష్కరించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని చిన్నారెడ్డి తెలిపారు. ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడానికి ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన 16 కౌంటర్ల పనితీరును, స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపిస్తున్న అంశాన్ని పరిశీలించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజల నుండి అందే ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలియజేశారు.

# 'హరీశ్‌రావు కూడా బీజేపీలోకి పోతాడు'

-మొదటి పేజి తరువాయి

అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును కట్టించిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ ఇటీవల బీఆర్ఎస్ ఛలో మేడిగడ్డ పర్యటనకు ఎందుకు వెళ్లలేదు? అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ కూడా కాళేశ్వరం ప్రాజెక్టుపై నెగిటివ్ నివేదిక ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని చెప్పారని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఒకటవ తేదీనే వేతనాలు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. ఇక నుంచి యాదాద్రి కాదని... యాదగిరిగుట్టనే అని కోమటిరెడ్డి స్పష్టం చేసారు. త్వరలో యాదగిరిగుట్టగా మారుస్తూ జీవో తెస్తామన్నారు. కేసీఆర్‌ను ప్రజలే నామరూపాలు లేకుండా చేశారని విమర్శించారు.

**మోదీ కంటే రాహుల్ గాంధీకి ఎక్కువ మెజార్టీ వస్తుంది**

తెలంగాణలో లోక్ సభ ఎన్నికల కోసం తమ పార్టీలో అంతర్గతంగా సర్వే జరుగుతోందని కోమటిరెడ్డి తెలిపారు.



భువనగిరి నుంచి పోటీ చేయమని తాము రాహుల్ గాంధీని కోరామని తెలిపారు. భువనగిరి, ఖమ్మం, నల్గొండ లోక్ సభ స్థానాల నుంచి పోటీ చేస్తే దక్షిణాదిలోనే అత్యధిక మెజార్టీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కంటే రాహుల్ గాంధీ ఎక్కువ మెజార్టీ సాధిస్తారని జోస్యం చెప్పారు.

**యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తాం**

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి పేరును మారుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. యాదాద్రి పేరును గతంలో ఉన్న యాదగిరి గుట్టగా మార్పుచేస్తామని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలోనే జీవో ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ఇదే విషయమై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తాజాగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో యాదాద్రి పేరుమార్పుపై స్పందించారు. భువనగిరి నుంచి పోటీ చేయమని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి చెప్పానన్నారు. భువనగిరి, నల్లగొండ, ఖమ్మం పార్లమెంట్ స్థానాల్లో దక్షిణ భారతదేశంలోనే భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కంటే రాహుల్ అత్యధిక ఓట్లతో గెలుస్తారని చెప్పారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు సురక్షితం కాదు...



-మొదటి పేజి తరువాయి

కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, భూపాలపల్లి ప్రాంతాల్లో ఒక్క చుక్క నీరు అందలేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా మేడిగడ్డను సందర్శించారని... ఈ ప్రాజెక్టు సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారన్నారు. మేడిగడ్డకు మరమ్మతులు నిపుణుల సూచనల మేరకు జరుగుతాయన్నారు. వాళ్లు చెప్పారనో... వీళ్లు చెప్పారనో... అలాంటి వారి సలహాలపై మరమ్మతులు చేపడితే ప్రాజెక్టు మళ్లీ కుంగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీర్లు, నిపుణుల సూచనల కోసం తమ ప్రభుత్వం వేచి చూస్తోందన్నారు. తాము అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా పూర్తి కాలేదని, కానీ అప్పుడే ఆరు గ్యారెంటీల్లో పలు హామీలను అమలు చేసినట్లు తెలిపారు. హామీలు అమలు చేసిన విషయం బీఆర్ఎస్ నేతల కళ్లకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు.

## జీహెచ్ఎంసీ ప్రక్షాళన.. 14 మంది అధికారులపై వేటు

**హైదరాబాద్:** జీహెచ్ఎంసీలో అధికారుల ప్రక్షాళన మొదలైంది. రిటైర్డ్ ఉద్యోగులపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను కమిషనర్ టర్మినేట్ చేశారు. 45 మంది రిటైర్డ్ ఉద్యోగుల్లో 37 మంది తమ విధుల నుంచి వైదొలిగారు. అక్రమాలకు పాల్పడిన 14 మంది అధికారులను విధుల నుంచి కమిషనర్ తొలగించారు. తప్పులు చేస్తున్న పలువురు అధికారులకు రోనాల్డ్ రోస్ మెమోలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కాగా, అక్రమాల కట్టడి కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఇతరుల హాజరుకు వినియోగిస్తున్న ఫింగర్ ప్రింట్స్ బయోమెట్రిక్ స్థానే ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగినషన్ బయోమెట్రిక్‌ను ఉపయోగించేందుకు సిద్ధమైంది. తద్వారా బోగస్ కార్మికులకు అడ్డుకట్ట వేయవచ్చని, ఫలితంగా ఏటా కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం కాకుండా నివారించవచ్చునని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఈ విధానాన్ని అమలు చేస్తుండటంతో జీహెచ్ఎంసీ కూడా రెడీ అయ్యింది.

## అంగన్వాడీ కేంద్రాలపై నిఘా

-మొదటి పేజి తరువాయి

సూచించారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టిసారించాలన్న సీఎం.. మొదటి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టిసారించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. ఈ సమావేశానికి మంత్రి సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు.

## తెలంగాణలో మెజార్టీ సీట్లు సాధిస్తాం

-మొదటి పేజి తరువాయి

ఈ ఎన్నికలకు 'మరోసారి మోదీ సర్కారు' అనేది మా పార్టీ నినాదమని తెలిపారు. బీజేపీకి ప్రజలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. ప్రధాని మోదీ 4న అదిలాబాద్, 5న సంగారెడ్డిలో పర్యటిస్తారని తెలిపారు. ఆదిలాబాద్‌లో రూ. 6,697 కోట్లు, సంగారెడ్డిలో రూ. 9,021 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని చెప్పారు.

**ప్రధాని పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానాలు పంపిస్తామన్న కిషన్ రెడ్డి**

ప్రధాని తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భాల్లో స్వాగతం పలికే సంప్రదాయాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పట్లో తుంగలో తొక్కారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతారని భావిస్తున్నామని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల 4, 5 తేదీల్లో ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనున్నారని తెలిపారు. ప్రధాని పర్యటనకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానాలు పంపిస్తామన్నారు. రాష్ట్రానికి ప్రధాని వచ్చిన సందర్భంలో గవర్నర్, ముఖ్యమంత్రి, అధికారులు స్వాగతం పలకడం సంప్రదాయమని చెప్పారు. కానీ గత ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ అంశంపై మాట్లాడుతూ... అందరికంటే ముందుగా తామే అక్కడకు వెళ్లామని గుర్తు చేశారు. మేడిగడ్డపై డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక సరైనదే అన్నారు.

## ఫస్ట్ లిస్ట్‌లో తెలంగాణ 9 సీట్లకు అభ్యర్థులు వీళ్లే..



**ఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికలు 2024 కోసం అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది భారతీయ జనతా పార్టీ. మొత్తం 195 స్థానాల్లో తెలంగాణ నుంచి 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వీళ్లలో ముగ్గురు సిట్టింగ్‌లే ఉండగా.. ఓ సిట్టింగ్‌కు మొండిచేయి ఎదురైంది. సికింద్రాబాద్ నుంచి కిషన్‌రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్‌లే పోటీ చేస్తారని తెలిపింది. అలాగే.. చేవెళ్ల నుంచి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి-బూర నర్సయ్య గౌడ్, నాగర్‌కర్నూల్ నుంచి పీ.భరత్, జహీరాబాద్ నుంచి బీబీ పాటిల్‌కు అవకాశం ఇచ్చింది. ఇక హైదరాబాద్ నుంచి కొంపెల్ల మాధవీలతకు ఛాన్స్ ఇచ్చారు. హాట్ నియోజకవర్గం భావిస్తున్న మల్కాజ్‌గిరి నుంచి ఈటల రాజేందర్‌ను బరిలోకి దింపేందుకు బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఇక.. ఇటీవలె బీజేపీలో చేరిన నాగర్‌కర్నూల్ సిట్టింగ్ ఎంపీ రాములుకి మొండిచేయి ఎదురైంది. ఆ స్థానంలో పీ.భరత్‌కు అవకాశం ఇచ్చారు. ఇక తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల ప్రకటనతో.. ఆదిలాబాదు, పెద్దపల్లి, మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం స్థానాలకు అభ్యర్థుల ప్రకటనను బీజేపీ పెండింగ్‌లో ఉంచినట్లయ్యింది.

# సంపాదకీయం

## దూసుకెళ్తున్న జీడీపీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి ఊహించిన దానికంటే అత్యధికంగా దూసుకెళ్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే రెండు రెట్లు పెరగడం విశేషం. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 8.4 శాతానికి చేరుకుందని గురువారం జాతీయ గణాంకాల కార్యాలయం(ఎన్ఎస్ఓ) వెల్లడించింది. ఇది గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 4.3 శాతం కంటే చాలా ఎక్కువ. అంతేకాకుండా భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) అంచనా వేసిన 6.5 శాతం కంటే అధికం. ఇదే సమయంలో మొదటి, రెండో త్రైమాసికలకు సంబంధించిన గణాంకాలను కూడా ఎన్ఎస్ఓ సవరించింది. ఇంతకుముందు మొదటి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండగా 8.2 శాతానికి సవరించింది. అలాగే రెండో త్రైమాసికానికి వృద్ధి రేటును 7.6 శాతం నుంచి 8.1 శాతానికి పెంచింది2023-24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కూడా ఎన్ఎస్ఓ వృద్ధి అంచనాను 7 శాతం నుండి 7.6 శాతానికి సవరించింది. తయారీ రంగం నెమ్మదించడం, బలహీనమైన వినియోగం కారణంగా అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో వృద్ధి మందగిస్తుందని పలువురు ఆర్థికవేత్తలు రాయిటర్స్ పోల్‌లో భావించారు. అయితే, అందుకు భిన్నంగా వృద్ధి రేటు పుంజుకోవడం గమనార్హం. సమీక్షించిన కాలంలో తయారీ రంగం 11.6 శాతం, నిర్మాణ రంగం 10.7 శాతం, వ్యవసాయ రంగం 3.8 శాతం వృద్ధి చెందాయి. మైనింగ్ రంగ వృద్ధి 7.5 శాతం, విద్యుత్, ఇతర యుటిలిటీల వృద్ధి 9 శాతంతో జీడీపీ పెరుగుదలకు దోహదపడ్డాయి. ప్రధాన రంగాల్లో వృద్ధి పెరగడమే జీడీపీ పుంజుకునేందుకు ప్రధాన కారణమని ప్రభుత్వం తెలిపింది.మరోవైపు, భారత ఎనిమిది కీలక రంగాల వృద్ధి రేటు వార్షిక ప్రాతిపదికన జనవరి నెలకు సంబంధించి 15 నెలల కనిష్టంతో 3.6 శాతంగా నమోదైందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. అంతకుముందు డిసెంబర్‌లో ఇది 4.9 శాతం పెరిగింది. ప్రధానంగా బొగ్గు, ఉక్కు, సిమెంట్, సహజ వాయువు, విద్యుత్, ముడి చమురు రంగాల్లో ఉత్పత్తి సానుకూలంగా నమోదైంది.వృద్ధి రేటు వేగంగా పెరగడానికి కారణం స్పష్టంగా బేస్ ప్రభావం. అటువంటి పరిస్థితిలో, దీనిలో స్పష్టత కోసం మనం త్రైమాసిక ప్రాతిపదికన ఉఆఖ ని చూడవలసి ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఇది త్రైమాసిక ప్రాతిపదికన మెరుగుపడటం మంచి విషయం అని వారు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం ఉఎం రూ. 30.1 లక్షల కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది 18.8% పెరుగుదల. కానీ రెండు ఆర్థిక సంవత్సరాల కంటే 22.4% తక్కువ. ఉఎం ఆర్థిక వ్యవస్థ యొక్క మొత్తం ఉత్పత్తి .. ఆదాయాన్ని చూపుతుంది. ఇన్‌పుట్ ఖర్చు?ముడి పదార్థాల ధరను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఇచ్చిన వ్యవధిలో ఎన్ని రూపాయల విలువైన వస్తువులు.. సేవలు ఉత్పత్తి జరిగిందో ఇది తెలియజేస్తుంది.వృద్ధి గణాంకాలు అద్భుతంగా కనిపిస్తున్నప్పటికీ అవి కొంతమంది ఆర్థిక నిపుణులను నిరాశపరిచాయి. కొటక్ మహీంద్రా బ్యాంక్ సీనియర్ ఎకనామిస్ట్ ఉపాసన భరద్వాజ్ తన అంచనా 21.7%కంటే తక్కువగా ఉందని చెప్పారు. అయితే, ఆహా బ్యాంక్, సింగపూర్ ఆధారిత ఆర్థికవేత్త రాధికారావు వంటి నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. తన అంచనా ప్రకారం వృద్ధి రేటు ఉందని ఆయన అన్నారు. కోటక్ బ్యాంక్ భరద్వాజ్ జూలై నుండి ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడటం ప్రారంభించాయని, ఇప్పుడు అది వేగం పుంజుకుందని చెప్పారు. టీకాలు వేసుకుంటే ఆర్థిక కార్యకలాపాలు మరింత వేగవంతం కాగలవని ఆయన అభిప్రాయపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రాలు లోటు తీర్చేందుకు రూ 1.5 లక్షల కోట్లు ఋణం ఉంటుంది అని చెప్పింది.అంటే ఆదాయ సేకరణ వ్యయం కంటే తక్కువగా ఉండవచ్చు, కాబట్టి ఒక నెలలో లక్ష రూపాయల కంటే ఎక్కువ సేకరణ జరిగిందని చెబితే, అది మంచి విషయం. అప్పుడు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. అటువంటి పరిస్థితిలో, అత్యుత్తమ డేటా ఆర్థిక రంగం నుండి వస్తుంది. ఇది మరింత విశ్వసనీయమైనది. కంపెనీలు ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నాయో లేదో బ్యాంక్ రుణాలు సూచిస్తాయి. అయితే, వర్కింగ్ క్యాపిటల్ కోసం తీసుకున్న బ్యాంక్ రుణాలు వార్షిక వృద్ధిని చూపలేవు. డెట్ మార్కెట్ సంభావ్య పెట్టుబడుల గురించి చెబుతుంది. కానీ, ప్రస్తుతానికి ఈ ఫ్రంట్‌లో కూడా ఏమీ మంచిది కాదు.జీడీపీ అంచనాల్ని మించి నమోదవగా.. ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ సామర్థ్యానికి జీడీపీ గణాంకాలు నిదర్శనం అని ట్విట్టర్ (చీ) వేదికగా పోస్ట్ చేశారు. 'తాజాగా జీడీపీ గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థ బలం, సామర్థ్యా?న్ని ప్రతిబింబిస్తున్నాయి. వేగవంతమైన వృద్ధికి, 140 కోట్ల మంది భారతీయులు అత్యుత్తమ జీవనం గడిపేందుకు, వికసిత భారత్‌ను సృష్టించేందుకు ప్రభుత్వం తన చర్యల్ని కొనసాగిస్తుంది.' అని అన్నారు మోదీ.

# చంద్రయాన్-3 ఆవిష్కరణలు



భారత్ పంపిన చంద్రయాన్- 3 మిషన్ స్పేస్ క్రాఫ్ట్‌లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు చంద్రుడిపై 10 రోజుల పాటు డేటా, ఫోటోల సేకరణ జరిపి వాటిని పరిశీలన కోసం భూమికి పంపాయి. ల్యాండర్- రోవర్‌లు పని చేయడానికి అవసరమైన బ్యాటరీలు ఛార్జ్ అవడానికి సూర్యరశ్మి అవసరం. దక్షిణ ధ్రువంపై పగటి సమయం ముగియడంతో గత ఏడాది సెప్టెంబర్ తొలి వారంలో విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లను ఇస్రో స్లీప్ మోడ్‌లోకి పంపింది. తిరిగి సెప్టెంబర్ 22వ తేదీన సూర్యోదయం అయ్యే సమయాన రెండూ తిరిగి యాక్టివ్ అవుతాయని ఇస్రో శాస్త్రవేత్తలు ఆశించారు. ల్యాండర్ చంద్రుడిపై దిగిన క్షణం నుంచి విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లు తీసిన చిత్రాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇస్రో సోషల్ మీడియా వేదికగా ప్రజలకు అందజేసింది. ఈ చిత్రాలు చాలా మంది భారతీయుల్లో సరికొత్త ఆసక్తిని రేకెత్తించాయి. కొంత మంది మాత్రం ఈ సమాచారం ప్రాముఖ్యత ఏంటి, అవి ఎందుకు ఉపయోగపడతాయని ఆన్‌లైన్‌లో పరిశోధనలు ప్రారంభించారు. దీంతో నాసా పూర్వపు శాస్త్రవేత్త, ఢిల్లీకి చెందిన స్పేస్ ఎడ్యుకేషన్ సంస్థ కో ఫౌండర్ మిలా మిత్రా జాతీయ మీడియా సంస్థలతో మాట్లాడుతూ అనేక ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ప్రజ్ఞాన్ రోవర్‌ను స్లీప్ మోడ్‌లోకి పంపే కొన్ని గంటల ముందు ప్రజ్ఞాన్ రోవర్ 100 మీటర్లు (328 అడుగులు) పైగా ప్రయాణించింది. ఇంకా కొనసాగుతోంది అని ఇస్రో ట్వీట్ చేసింది. ప్రజ్ఞాన్ సెకనుకు 1 సెంటీ మీటర్ వేగంతో 6 చక్రాలతో చాలా దూరమే ప్రయాణించింది. దీని ప్రాముఖ్యాన్ని మిత్రా వివరిస్తూ, ఎవరూ ఎక్కువగా అన్వేషించని దక్షిణ ధ్రువ ప్రాంతంలో సంచరిస్తూ, బిలాల్లో పడిపోకుండా సురక్షితంగా రోవర్ ప్రయాణం చేసింది అని వెల్లడించారు. ఈ సందర్భంగా రోవర్‌కు అమర్చిన చక్రాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను మిత్రా వివరించారు. రూకర్ బూగీ అని పిలిచే మెకానిజాన్ని ఇందులో వినియోగించారు. అంటే ఆరు చక్రాలు ఒకేసారి కదలవు. దీని వల్ల రోవర్‌పైకి కిందకు కదిలేందుకు వీలవుతుంది. కానీ, ఒకవేళ లోతైన బిలంలో పడిపోతే పైకి రాలేకపోవచ్చు. అందువల్ల రోవర్‌ను నేలపై ఉన్న బిలాల చుట్టూ వెళ్లేలా చేయడం, లేదంటే దిశ మార్చుకునేలా చేయడం ముఖ్యం. కమాండ్ సెంటర్ నుంచి శాస్త్రవేత్తలు రోవర్‌కు అమర్చిన కెమెరాల ద్వారా, అక్కడ నేలపై ఏముందో గమనిస్తూ రోవర్‌ను ముందుకు నడిపించారు. రోవర్ ఆటోమేటెడ్ కాదు. అది పంపే చిత్రాలను ఆధారం చేసుకుని, కమాండ్ సెంటర్ నుంచి నియంత్రించారు. రోవర్ పంపే ఫోటోలు కమాండ్ సెంటర్‌ను చేరుకోవడంలో కాస్త ఆలస్యం అవుతుంది. ఎందుకంటే ప్రజ్ఞాన్ రోవర్ సమాచారాన్ని మొదట విక్రమ్ ల్యాండర్‌కు పంపుతుంది. ల్యాండర్ దానిని ఆర్బిటర్‌లోకి పంపుతుంది. ఆర్బిటర్ భూమికి చేరవేస్తుంది అని ఆమె తెలిపారు. కాబట్టి, ఆదేశాలు రోవర్‌ను చేరే సమయానికి అది బిలానికి కొన్ని అడుగుల దూరంలో మాత్రమే ఉంది.అయితే ప్రజ్ఞాన్ రోవర్ రెండు బిలాల మధ్య నుంచి సురక్షితంగా ప్రయాణం చేసి, కమాండ్ సెంటర్‌కు వేగంగా సమాచారం పంపిందని మిత్రా వివరించారు. ల్యాండర్ విక్రమ్‌కు అమర్చిన ప్రోబ్ చంద్రుడి ఉపరితలంపై ఉన్న మట్టితో పాటు, 10 సెంటీమీటర్ల లోతులో ఉన్న మట్టిని కూడా పరిశీలించింది. ఆ తరువాత తొలి దశ సమాచారాన్ని సేకరించి కమాండ్ సెంటర్‌కు పంపింది. ఈ సమాచారంలో చంద్రుడి ఉపరితలంపైనా, నేలలోపలఉన్న ఉష్ణోగ్రతల్లో గణనీయమైన వ్యత్యాసాలు కనిపించాయి. ఉపరితలంపై ఉష్ణోగ్రత 60 డిగ్రీలు ఉండగా, లోతుకు వెళ్లే కొద్దీ భారీగా పడిపోయింది.80 మిల్లీమీటర్ల లోతున ఉష్ణోగ్రత -10 డిగ్రీలకు పడిపోయింది. చంద్రుడిపై ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని నాసా ఇంతకు ముందే ప్రకటించింది. ఆ ప్రకారం పగటిపూట చంద్రుడి భూమధ్య రేఖ సమీపాన ఉష్ణోగ్రత 120 డిగ్రీల సెల్సియస్, రాత్రి వేళ -130 డిగ్రీలు సెల్సియస్ పడిపోతుంది. శాశ్వతంగా సూర్మరశ్మి పడని బిలాల్లో ఉష్ణోగ్రత 250 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. ఉష్ణోగ్రతల్లో ఉన్న ఈమార్పు చాలా కీలకమైనది మిత్రా అన్నారు. లూనార్ రిగోలిత్గా పిలిచే ఈ చంద్రుడి మీది మట్టిని మంచి ఇన్సులేటర్‌గా చెప్పవచ్చని అన్నారు. దీని ద్వారా ఏం తెలుసుకోవచ్చంటే వేడి, చలి, రేడియేషన్లను నిరోధించేందుకు ఈ మట్టిని ఉపయోగిస్తూ స్పేస్ కాలనీలను నిర్మించవచ్చు. అంతేకాకుండా, నేలలోపల నీటి ఉనికి ఉందనడానికి ఇది ఒక సూచన అని అన్నారు.చంద్రుడి దక్షిణ ధ్రువపు ఉపరితలంలో ఉన్న మూలకాల ఉనికిని తెలుసుకునేందుకు రోవర్ లేజర్ డిటెక్టర్‌ను అమర్చారు. ఈ లేజర్ డిటెక్టర్ ద్వారా ఉపరితలంలో అల్యూమియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్, ఆక్సీజన్ మూలకాలు ఉన్నాయని గుర్తించారు. అన్నిటికన్నా ముఖ్యమైనది సల్ఫర్ ఉనికిని నిర్ధారించడమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
తొలిసారిగా చంద్రుడి ఉపరితలంలో సల్ఫర్ ఉనికిని గుర్తించామని ఇస్రో పేర్కొంది. చంద్రుడిపై సల్ఫర్ ఉనికి గురించి 1970లలోనే తెలుసు. అయితే, రోవర్ చంద్రుడి నేలపై ఉన్న ఖనిజం లేదా స్ఫటికంలోని భాగంలో ఉన్న సల్ఫర్‌ను కాకుండా, చంద్రుడి ఉపరితలంపైనే సల్ఫర్ ఉన్నట్లు గుర్తించడం అద్భుతమైన విషయంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. మట్టిలో సల్ఫర్ ఉనికిని కనుక్కోవడం వివిధ కోణాలలో కీలకమైన అంశం. సాధారణంగా అగ్నిపర్వతాలనుంచే సల్ఫర్ వెలువడుతుంది. దీనిని బట్టి మనకు చంద్రుడి ఆవిర్భావం, భౌగోళిక పరిస్థితులు, పరిణామక్రమంపై సమాచారం తెలుస్తుందిఅని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇది మాత్రమే కాకుండా సల్ఫర్ కనిపించడమంటే చంద్రుడి ఉపరితలంపై నీటి ఉనికికి ఒక సూచిక.సల్ఫర్ సహజ ఎరువు. ఇక్కడ మరో మంచి విషయం ఏంటంటే చంద్రుడిపై సహజంగా మొక్కలు పెరగడానికి సల్ఫర్ పని కొస్తుంది. ప్రకంపనలను రికార్డు చేసి విశ్లేషించే సామర్థ్యం ఉన్న ఇల్సా అనే పరికరాన్ని విక్రమ్ ల్యాండర్‌లో అమర్చారు. ఇది విక్రమ్ ల్యాండర్‌తో పాటు, రోవర్ కదలికలు, కార్యకలాపాల సమాచారాన్ని కూడా విశ్లేషిస్తుంది. చంద్రుడి నేలలోని మార్పులను గమనించే ఇల్సా పరికరం ఒక విశేషమైన ఘటనను రికార్డు చేసింది. అదే చంద్రుడిపై ప్రకంపనలకు ప్రధాన కారణం.ఈ సంఘటనకు చాలా ప్రాధాన్యత ఉంది.దీనికి చాలా వివరణలు, విశ్లేషణలు కూడా చాలా ఉండొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బహుశా అంతరిక్ష శిథిలాలు, గ్రహకలం, ఉల్క వంటివి చంద్రుడి ఉపరితలాన్ని బలంగా ఢీ కొట్టడం వల్ల ఈ ప్రకంపనలు ఏర్పడి ఉండొచ్చు. లేదంటే సహజంగానే ఏర్పడి ఉండవచ్చు. 1970ల తర్వాత నమోదైన తొలి ప్రకంపనగా దీన్ని భావించవచ్చు. చంద్రుడి ఉపరితలం కింద ఏముంది? భౌగోళిక స్థితి ఎలా ఉంది? అన్న విషయాలను పరిశోధించేందుకు ఇది ఉపయోగపడవచ్చు.

## కనీవినీ ఎరుగని విధ్వంసం

భూ వాతావరణం మారిపోయింది. సహస్రాబ్దాలుగా చూడని స్థాయిలో నేడు పర్యావరణ విధ్వంసం కొనసాగుతోంది. భారతదేశంలో ప్రస్తుత గ్లోబల్ వార్మింగ్ ట్రెండ్ వరి ధాన్యం ఉత్పత్తి, ఇథనాల్‌తో ముడిపడి ఉంది.ఇప్పుడు శిలాజ రహిత ఇథనాల్ ఇంధనం ద్వారా కార్బన్ డయాక్సైడ్ పరిమాణం పెరగడం వల్ల ఇది భయంకరంగా భూమిని వేడెక్కిస్తోంది. ఇది కొనసాగితే, ప్రపంచంలోని చాలా ప్రాంతాలకు పర్యావరణ విపత్తును తీసుకురావచ్చని 195 దేశాల శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇథనాల్ ఆవిరి గాలిలో ఐదు రోజుల వరకు ఉంటూ మెల్లిగా క్షీణిస్తుంది. ఒక గాలన్ ఇథనాల్ దహన సమయంలో 18.92 పౌండ్ల (8,595 గ్రాములు) సీఓ2ని విడుదల చేస్తుంది. ఇది సగటున ఒక మైలు డ్రైవింగ్ చేస్తే 315 గ్రాముల %జూ%2 విడుదల అవుతుందని నేషనల్ వైల్డ్ లైఫ్ ఫెడరేషన్ యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ పరిశోధనలో ధ్రువీకరించారు. ప్రపంచ దేశాలు ఇథనాల్ ఉత్పత్తిలో పారిశ్రామికవేత్తలకు అత్యధిక రాయితీలు ప్రకటిస్తూ అత్యాధునిక జీవ ఇంధన విప్లవం అంటూ పంటలను ప్రజలకు కాకుండా కార్లకు ఆహారంగా మళ్లిస్తున్నారు. దీంతో ఆహారం ధరలు పెరుగుతూ ప్రపంచంలోని పేదలు ఆకలితో అలమటిస్తారు. ఇథనాల్ రసాయన కర్బన సమ్మేళనం వల్ల మానవ ఉనికికే ప్రమాదం కల్పించడం అనేది అంతర్జాతీయంగా మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. దేశంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 2018 జూలై నుండి 2022 ఏప్రిల్ వరకు వివిధ ఇథనాల్ వడ్డీ రాయితీ పథకాలను నోటిఫై చేసింది. దేశ వ్యాప్తంగా కొత్త డిస్టిలరీలను, మొలాసిస్ ఆధారిత, ధాన్యం-ఆధారిత డిస్టిలరీలను విస్తరించడానికి ప్రభుత్వం పారిశ్రామిక వ్యవస్థాపకులకు సౌకర్యాలు కల్పిస్తోంది. ఈనాడు ఇథనాల్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా మునుపెన్నడూ లేని విధంగా భూ కబ్జా జరుగుతోంది. భవిష్యత్తులో ఆహార కొరత వస్తుందనే భయంతో వాటి నుండి అత్యధిక లాభం పొందాలనే తపనతో, అత్యంత సంపన్నమైన దేశాలు, రాష్ట్రాలు, సంస్థలు, వ్యక్తులు ప్రపంచవ్యాప్తంగా విస్తారమైన భూములను కొనుగోలు చేసి లీజుకు ఇస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగమై విభిన్నమైన రూపంలో, భిన్నమైన దోపిడీతో సామ్రాజ్య అధినేతలు, భారత పాలకులు కొత్త రూపంలో ముందుకు వస్తున్నారు. కాప్ 28 సదస్సులో 100 కంటే ఎక్కువ దేశాలు 2030 నాటికి ప్రపంచ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచుతామని ప్రతిజ్ఞ చేయడంతో, భారతదేశం తన ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యానికి సంబంధించి గట్టి సవాలును ఎదుర్కొంటోంది. కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ధాన్యం-ఆధారిత ఇథనాల్ వైపు పెద్ద మార్పును చూస్తోంది. ఆహార ధాన్యాలు లేదా బియ్యం నుండి తీసుకున్న ఇథనాల్‌కు ప్రభుత్వం వేర్వేరు ధరలను నిర్ణయించింది. ఇథనాల్ సరఫరా అయితే ఇది ఆర్థిక వ్యవస్థకు మరిన్ని సవాళ్లను సృష్టించే ప్రమాదం ఉంది. దేశంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాల వెనక ఉన్న లాబీలను విస్మరించలేం. చక్కెర మిల్లులు, ఇథనాల్ మిల్లులు రాజకీయ నాయకుల యాజమాన్యం ఆధీనంలోనే నడుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామంలో సుమారు 480 ఎకరాల భూమిలో జూరాల ఆర్గానిక్ ఫార్మ్స్ ఉ ఆగ్రో ఇండస్ట్రీస్ పేరిట ఆ కంపెనీ భాగస్వామ్యంలో ఒకరైన బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రెడ్డి వరి ధాన్యంతో ఇథనాల్ ఉత్పత్తి వల్ల మహబూహబ్‌నగర్ జిల్లాలోని 54 గ్రామాలలోని ప్రజలు వాయు కాలుష్యం, నీటి కాలుష్యంతో ప్రతి ఇంట్లో జలుబు, దగ్గు, ఆయాసంతో రొప్పుతూ అసహజ మరణాలకు దగ్గరవుతున్నారు. గత రెండేళ్లుగా ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని న్యాయబద్ధంగా, శాంతియుతంగా 22-10-2023 న ధర్నా నిర్వహించారు. కాలుష్య వ్యర్థాల ట్యాంకర్‌ను అడ్డగించిన ప్రజలపై పాశవికంగా లాఠీచార్జి జరిపి అనేక మంది రైతులు, మహిళలు, యువకులను తీవ్రంగా గాయపరచి, అక్రమకేసులు బనాయించి పోలీస్ స్టేషన్‌లలో చిత్రహింసలకు గురి చేశారు. చిత్తనూరులో శాంతియుతంగా జరుగుతున్న ధర్నాను చూడడానికి వచ్చిన 80 సంవత్సరాల వయోవృద్ధుడైన కాశీం లాఠీచార్జికి బలై తీవ్ర గాయాలతో మొన్న 2023 డిసెంబరులో చనిపోయారు. ప్రపంచ బ్యాంకు ఒత్తిడి సామ్రాజ్య నేతల ఆజ్ఞలకు లోబడి కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ లో ఇథనాల్‌ని కలపటం ఒక రకంగా కల్తీయే.

## చిల్లతిన్లతో ఛిద్రమవుతున్న ఆరోగ్యం

డిజిటల్ యుగపు మానవుడి జీవనశైలిలో పను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతికూల ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ కరువు కావడం, కూర్చొని గంటల తరబడి పని చేయడం, అర్థ రాత్రి వరకు మెలకువగా ఉండడం, స్మార్ట్‌ఫోన్ దుర్వసనాలకు లోనుకావడం లాంటివని సర్వసాధారణం అయ్యాయి. వీటికి తోడుగా శీతలపానీయాలు/మద్యం విచ్చలవిడిగా సేవించడం, పొగ తాగడం, జంక్/ప్యాకేజ్ ఫుడ్స్‌ను లొట్టలేసుకుంటూ తినడం లాంటి అలవాట్లు నేటి ఆధునిక యువత జీవనశైలిలో భాగాలు అవుతున్నాయి. బ్రెడ్స్, ఫ్రోజెన్ మీల్స్, బేక్డ్ పదార్థాలు, చీజ్, చిప్స్, చాకోలెట్స్, క్యాండీ,ఐస్ క్రీమ్స్, నూడుల్స్, సూప్స్, మీట్, సూసులు, నగెట్స్, ఫింగర్స్, సోడా ఉత్పత్తులు, శీతలపానీయాలు, ఫ్రోజెన్ ఫుడ్స్ లాంటివి ప్రాసెస్టేడ్ ప్యాకేజ్డ్ ఫుడ్స్ జాబితాలోకి వస్తాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం 30 బ్రెవరేజ్ ఫుడ్స్ తయారు చేస్తున్న 1,306 ప్యాకేజ్ ఫుడ్స్‌లో 95 శాతం వరకు ఆరోగ్యాన్ని హరించే ఆహార పదార్థాలే ఉన్నట్లు తేలింది. ఇలాంటి ఆహార పదార్థాల్లో డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన మోతాదుకు మించి హానికారక పదార్థాలు ఉన్నట్లు తేలడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. ఇలాంటి ఉత్పత్తుల్లో 62 శాతం వరకు మూడు లేదా అంత కన్న ఎక్కువ న్యూట్రిషన్ కాంపొనెంట్స్ మోతాదులు అధికంగా ఉన్నాయని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌ను ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్ ముంచెత్తుతున్నాయి. నేటి యువత ఇలాంటి హానికారక ఫుడ్ ప్యాకెట్స్‌ను మితిమీరి తినడం సర్వసాధారణం అయ్యింది. ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్‌లో మోతాదుకు మించి ఉప్పు, షుగర్, లేదా కొవ్వులు ఉంటున్నాయనే వాస్తవాలను నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇలాంటి ప్యాకేజ్ ఫుడ్స్‌పై మోతాదుకు మించి ఉన్న పోషకాల వివరాలను హెచ్చరికలుగా ముద్రించే విధంగా చర్యలు తీసుకోవాలని పిల్లల వైద్యులు, పోషకాహార నిపుణులు, ప్రజారోగ్య సంస్థలు, వినియోగదారుల సంఘాలు లాంటి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. "న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంటరెస్ట్, ఎన్ఏపిఐ" వివరాల ప్రకారం డిజిటల్/ప్రింట్ మాధ్యమాల్లో ప్యాకేజ్ ఫుడ్స్‌ను ప్రోత్సహించే ప్రకటనల్లో అమితాబ్ లాంటి సెలబ్రీటీలను వాడుకోవడం కూడా తప్పుదారి పట్టించే విధంగా ఉంటున్నాయని కూడా పేర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి నెల 10 ప్రముఖ టీవీ చానెల్స్‌లో 2 లక్షలకు పైగా ప్యాకేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన ఆకర్షణీయ ప్రకటనలు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తున్నది. ఇలాంటి ప్రకటనలపై ప్రభుత్వ ప్రమేయం లేకపోవడం విచారకరం. జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకెట్లపై "మోస్ట్ ఇంపార్టెంట్ ఇన్ఫర్‌మేషన్" అనబడే పూర్తి సమాచారం ఉండాలంటూనే మోతాదుకు మించి ఉప్పు, చక్కెరలు, సంతృప్త కొవ్వులు, ప్రమాదకర కృత్రిమ రసాయనాలు ఉన్నట్లు ముఖ్య సమాచారం ముద్రించాలని ఏన్ఏపిఐతో పాటు పౌర సమాజం కూడా కోరుకుంటున్నది. అల్ట్రా ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌లో మోతాదుకు మించి చక్కెరలు, ఉప్పు, సంతృప్త కొవ్వులు ఉంటున్నాయని - ఇలాంటి ఆహార పదార్థాలను అతిగా తీసుకున్నపుడు స్థూలకాయం, మధుమేహం లాంటి జీవనశైలి రుగ్మతలు కలుగుతున్నాయని తేల్చారు. నేటి భారతంలో అధ్యయనం చేసిన 6 శాతం మంది 5 ఏండ్ల లోపు బాలల్లో 43 లక్షల మంది అధిక బరువు లేదా స్థూలకాయ బారిన పడ్డారని తేల్చారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తరుచుగా అధిక మోతాదులో తీసుకునే అలవాటు ఉన్న వారిలో క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుందని తేలింది. ప్రాసెస్డ్ ఫుడ్ 10 శాతం వరకు వినియోగం పెరిగితే వారిలో 12 శాతం క్యాన్సర్ రిస్క్ పెరుగుతుంది. అధిక ఉప్పు, కొవ్వులు తీసుకున్నపుడు మధుమేహం, అధిక బిపీ, స్థూలకాయం, గుండెజబ్బులు, ఆకలి మందగించడం, జీర్ణ వ్యవస్థ రుగ్మతలు, ఎముకల బలహీనతలు, నీరసం, చర్మ సమస్యలు, దంతాల్లో రంధ్రాలు, కాలేయ వ్యాధులు, కిడ్నీ సమస్యలు, అధిక కొలెస్ట్రాల్ లాంటి అనారోగ్యాలు పెరుగుట గమనిస్తున్నాం. ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో శరీర ఎదుగుదలకు అవసరమైన పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు తక్కువగా ఉంటున్నాయి. ఇలాంటి ఆహార పదార్థాలు తొందరగా జీర్ణ కావడంతో ఆ కాలనీలను వినియోగించడానికి వీలు చిక్కక బరువు పెరగడం కనిపిస్తుంది. ప్రాసెస్డ్/జంక్ ఫుడ్స్‌లో దాదాపు 5,000 వరకు కలరింగ్, టెక్చరింగ్, ఫ్లేవరింగ్, సువాసనకు సంబంధించిన అడిటివ్స్, ప్రజర్వేటివ్స్ లాంటి కృత్రిమ రసాయనాలు కలుపుతున్నారనితెలుసు కోవాలి.

# స్థానిక వార్తలు

## బ్రహ్మేశ్వరం ఆలయం వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లు

### - గ్రామస్తులు దాతల సహకరం తోనే ముందడుగు





**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని కనకాపూర్ నది ఒడ్డున వెలసిన బ్రహ్మేశ్వరం ఆలయం మహాశివరాత్రి ఏర్పాట్ల కొరకు ఎవరు ముందుకు రాకపోవడంతో కనకాపూర్ యువత ముందుకు వచ్చి ఆలయం వద్ద గత ఐదు ఆరు రోజుల నుండి మహొత్సవాలకు ఆలయాన్ని అలంకరిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం గంగా నదిలో స్నానం ఆచరించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు మరమ్మత్తులు, అన్నదాన కార్య క్రమానికి దాతలు సహాయ సహకారాలు అందించవచ్చు అని గ్రామ యువకులు కోరుతున్నారు. ఫోన్ పే నెంబర్ 9652472619 ఈ నెంబర్ కు తోచిన సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్మాయి చిన్న దేవన్న, చాకలి గోపి, ఇర్ల రాజేందర్, కొత్తూర్ వికాస్, పుష్పూర్ సాయి, దెబ్బడి వేణు, కొత్తూర్ సచిన్, పుట్టి సతీష్, బైరి రాము, మాజీ సర్పంచ్ నరేష్, న్యాకం సాయి, యువకులు తదితరులు పాల్గొన్నారు

## భగవద్గీత పుస్తకాల అందజేత



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేద్రంలోని రామకృష్ణ సేవాసమితి వారికి పోతంగల్ గ్రామానికి చెందిన డాక్టర్ సీతాలే రమేష్ వంద భగవత్ గీత పుస్తకాలలను అందజేశాడు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మానవీయ విలువలు, భక్తి విశ్వాసాలు పెంపొందించేందుకు భగవద్గీత పుస్తకాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవ సమితి సభ్యులు హన్మంత్ రావు,రజినీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరస్యత వారోత్సవాలు



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరస్యత వారోత్సవాల సందర్భంగా డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలోడిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకి మెమోటల్ తో పాటు నగదు బహుమతి అందజే శారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపదయులు శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు సాయిలు, డీసీసీ బ్యాంకు మేనెజార్ గణేష, అసిస్టెంట్ మేనెజర్ వెంకటేశ్వర్ రావు, విద్యర్థిని విద్యర్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన తహసిల్దార్

**సిబ్బంది తీరుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానన్న తహసిల్దార్**



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తహసీల్దార్ సునీత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అధికారులు,సిబ్బంది ఎవరు లేకపోవడంతో సిబ్బంది పని తీరుపై తీరుపై అరా తీశారు. మండల కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఆసుపత్రిలో సిబ్బంది ఎవరు లేకపోవడం ఏంటి అని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**వాస్తవ నేస్తం,ముధోల్:** మండలంలోని కమోల్ గ్రామంలో మహా పోచమ్మ శ్రీ మహా లక్ష్మి దేవాలయాల మొదటి వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మండల నాయకులతో కలిసి ముధోల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్దే లక్ష్యంగా ప్రజలు ఐక్యమత్యంతో ఉండాలన్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షలు వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల అభివృద్ధి చెందేలా సి.సి రోడ్డు డ్రైనేజీ, పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, మండల వైస్ ఎంపీపీ, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మండల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు, భక్తులు ఉన్నారు.

## సైన్స్ ఓక అద్భుతం.. భవిష్యత్ తరాలకు ఆదర్శం



**వాస్తవ నేస్తం,ముదోల్:** మండల కేంద్రం లోని రబింద్ర స్కూల్ లో సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జన సేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకెట మహేష్ బాబు హాజరై విద్యార్థుల ప్రతిభను ప్రాజెక్ట్ వర్క్ ను పరిశీలించారు. చాలా అద్భుతంగా నూతన టెక్నాలజీ ద్వారా భవిష్యత్తు లో మనిషి మనుగడకు కావాల్సిన అనేక రకాల పరికరాలు విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. కొన్ని కళా రూపంలో హార్రర్ రూమ్,త్రీడీ,లాంటివి ప్రదర్శనలో అతిథులకు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమాన్ని తిలకించడానికి మండల పరిధిలోని విద్యార్థులు,తల్లి తండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు, మేధావులు,రాజకీయ నాయకులు,విచ్చేసి స్కూల్ ప్రిన్సిపాల్ సాయినాథ్,మురళి, తదితర ఉపాధ్యాయ, బృందానికి మెచ్చుకున్నారు.

## కనకాపూర్ లో హనుమంతుని తాకిన సూర్య కిరణాలు



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** అంజన్న చెంతకు సూర్యుడు చేరినట్టు ఉదయపు లేలేత భానుడి కిరణాలు ఆంజనేయ స్వామిని తాకాయి. ఈ అద్భుత దృశ్యం లోకేశ్వరం మండలం గ్రామంలోని కనకాపూర్ హనుమాన్ మందిరంలో శనివారం కనిపించింది. ఉదయాన్నే స్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు ఆంజనేయ స్వామి పై సూర్యకిరణాలు పడడాన్ని చూసి పరవశించిపోయారు. ఉదయం నిశ్శబ్దపు వాతావరణంలో చెట్ల కొమ్మలను తాకుతూ సూర్యుని కిరణాలు హనుమంతుని తాకడం భక్తులను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు స్వామివారిని స్మరించుకున్నారు. దీంతో తాము భగవంతుడి కటాక్షం పొందినట్లుగా భక్తులు భావించారు.

## ఇందిరా డైరీ ప్రాజెక్టు రూపకల్పన పై అవగాహన కార్యక్రమం



**వాస్తవ నేస్తం,బోనకల్:** మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండల కేంద్రంలో నిర్మించబోయే ఇందిరా డైరీ ప్రాజెక్ట్ గురించి మండల కేంద్రంలో స్నేహాంజలి మండల సమైక్య కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ కుమార్, అడిషనల్ డి ఆర్ డి ఓ బాలస్వామి, డిపిఎం లు వేణుగోపాల్, సతీష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా డైరీ ప్రాజెక్టు రూపకల్పనపై జరుగుతున్న వివిధ దశలను వివరించారు. ములుగు జిల్లా నుండి ఈ సమావేశానికి హాజరైన డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్, అడిషనల్ డిఆర్డిఓ బాలస్వామి, నూరుద్దీన్ లను బోనకల్ స్నేహాంజలి మండల సమైక్య సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం లు జె. లక్ష్మణరావు, పద్మలత, ఇందిరా డైరీ మండల సమాఖ్య ల నుండి అన్నపూర్ణ, లలిత, అర్చన, చాంద్ బీ, రెహాన, రమణ, రజని, ఆదిలక్ష్మి, కమలాకర్, జాన్సీ బాయ్, పుల్లయ్య ,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీజీటీ గురుకుల ఫలితాల్లో మండల వాసుల ప్రతిభ





**వాస్తవ నేస్తం,భీంపూర్ :**టీజీటీ గురుకుల ఫలితాల్లో ఇద్దరు మండల వాసులు మెరిశారు. భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మంగదుడ్ల ప్రియాంక టిజిటి సోషల్ లో ఎంపికైంది. ఇదివరకే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక య్యి ప్రస్తుతం శిక్షణ తీసుకుంటుంది. మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికట్ల అవినాష్ సైతం గురుకుల టిజిటి,జే ఎల్ రెండు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు కుటుంబీకులు,గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్చెరు డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ వద్దనుండి మున్నూరు కాపు భవనం వరకు గల ప్రధాన రోడ్డును జిహెచ్ఎంసి నిధులు 34లక్షల రూపాయల వ్యయంతో ఇరువైపులా 5 ఫీట్ల వెడల్పు పెంచే నిర్మాణ పనులకు ఈరోజు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, శంకుస్థాపన చేశారు. అనంతరం పటాన్చెరు లోని నందన్ రతన్ ప్రైడ్ కాలనీలో ప్రధాన సమస్య అయినటువంటి వర్షాకాలంలో కాలనీలో నిలిచే వరద నీరు సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు 1కోటీ 29లక్షల రూపాయల జిహెచ్ఎంసి నిధులతో పైపులైన్ పనులకు ఎమ్మెల్యే మైపాల్ రెడ్డి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు ఆఫ్జల్, పలువురు నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**వాస్తవ నేస్తం,ముధోల్:** నర్సాపూర్ (జి) మండలంలోని ఆర్లి గ్రామానికి చెందిన మగ్గిడి సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ముధోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్ట కాలంలో ధైర్యం ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నారు. ఆయనతో పాటు నాయకులు, తదితరులు ఉన్నారు.

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



## పోగొట్టుకున్న పర్సు భక్తుడికి అందజేత



**వాస్తవ నేస్తం,ముధోల్:** చదువుల తల్లి కొలువుదీరిన బాసర అమ్మవారి దర్శనార్థం శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామానికి చెందిన మల్లేశం అనే భక్తుడు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన పర్సు ఆలయంలో పడిపోయింది. బాసర ట్రిపుల్ ఐటీలో ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న తిరుపతికి పర్సు దొరికింది. వెంటనే ఆలయ అధికారులకు సమాచారం అందించగా, అతని పర్సులోని వివరాల ఆధారంగా సంబంధిత భక్తునికి అందజేశారు. పర్సులో రూ. 8, 800 నగదు, నాలుగు ఎటిఎం కార్డులు ఉన్నాయి.

## గృహ జ్యోతి పథకం కింద రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్

**ప్రారంభించిన ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్**



**వాస్తవ నేస్తం,ముధోల్:** భైంసా పట్టణంలోని కిసాన్ గల్లిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు 200 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ ను ఉపయోగించిన అందులో నుంచి 200 యూనిట్లను తీసివేసి బిల్లులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, స్థానిక కౌన్సిలర్ గాలి రవి, అసెంబ్లీ కన్వీనర్ తాడే వార్ సాయినాథ్ , పట్టణ అధ్యక్షులు మల్లేష్ అల్లెం దిలీప్, గౌతం పింగ్లే, కోర్వ శ్రీకాంత్, పట్టణ భాజాపా నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా భ్రమరాంబమల్లికార్జునుడి స్వామి కల్యాణ మహొత్సవం



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో శ్రీ భ్రమరాంబమల్లికార్జున స్వామి దేవాలయం పంచదశ తమ వార్షికోత్సవం పురస్కరించుకొని స్థానిక ఆలయ కార్యక్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారి స్వామివార్ల కల్యాణ మహొత్సవ కార్యక్రమం నేత్ర పర్వంగా సాగింది. శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమలతో కళ్యాణ మహొత్సవం కు విచ్చేసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. సాయంత్రం వరకు కూడా భారీగా హాజరైన భక్తజనం దైవ చింతనలో గడిపారు. రామారావు జోషి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మల్లికార్జున, భ్రమరాంబ దేవీల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను వాహనంపై ఊరేగించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల రైతు బంధు అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ మాజీ మండల అధ్యక్షులు ,ఎంపీటీసీ సత్యనారాయణ , తాజా మాజీ సర్పంచ్ ఇందూరి గంగన్న తాజా మాజీ సర్పంచ్ ఇందూరి గంగన్న, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, పరిసర గ్రామాలకు ప్రజలు, మహిళలు ,భక్తులు భారీగా పాల్గొన్నారు.

## ఎంపి దామోదర్ రావుకు మాతృవియోగం

**పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్ :** రాజ్యసభ సభ్యుడు, నమస్తే తెలంగాణ దినపత్రిక సీఎండి దామోదర్ రావుకు మాతృ వియోగం కలిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు అయన ఇంటికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో వారికి మనో ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుకున్నారు.

## కానిస్టేబుల్ ప్రాణం తీసిన రోడ్డు గుంత

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా పాలకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కానిస్టేబుల్ మృతి చెందాడు. కానిస్టేబుల్ సురేశ్ పాలకొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం పాలకొండకు వెళ్తుండగా గుంతను తప్పించబోయి అదుపుతప్పి బైక్ మీద నుంచి కిందపడ్డాడు. దాంతో అతడి తలకు తీవ్రంగా గాయమైంది. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

# సంస్కృతిని కాపాడాలంటే దేశభక్తి ఉండాలి






నారాయణ్ మహారాజ్

**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** భారతదేశ సంస్కృతిని కాపాడాలంటే భారతదేశంపై భక్తి కలిగి ఉంటేనే కాపాడగలమని నారాయణ్ మహారాజ్ అన్నారు. శనివారం మండలంలోని మాన్కపూర్ లోని సద్గురు పులాజి బాబా ధ్యాన మందిరం ప్రాంగణంలో సనాతన ధర్మ సేవా సమితి స్థాపన మహొత్సవ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ఏకంగా వెయ్యిమంది యువకులతో ఏకరూప దుస్తులతో భవ్య దివ్య శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ మహారాజు మాట్లాడుతూ.. చెట్లను, పశువులను, జంతువులను, పూజించే సంస్కృతి సాంప్రదాయం కేవలం సనాతన ధర్మంలోని ఉందని అన్నారు. యువత యొక్క శక్తి దేశం కోసం ధర్మం కోసం వినియోగించుకోవాలన్నారు. ఉగ్రవాదం పేరుతో దేశాన్ని కొందరు అతలాకుతలం చేయాలని చూస్తున్నారని అన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మాన మార్గంలో నడుచుకోవాలన్నారు. సనాతన ధర్మం కులం, రాజకీయాలకు దూరం ఉంటూ హిందూ ధర్మాన్ని కాపాడడమే తమ లక్ష్యం అని అన్నారు. ధర్మ రక్షణ కోసం మహిళలు కూడా అవసరమని మహిళలు ధర్మరక్షణ కోసం కూడా భాగ్యస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పిటిసి పతంగే బ్రహ్మానంద్, సొపాన్ మహారాజ్, అజ్మీరా బేబి, దిగంబర్, ఆర్యన్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట ఏఐఎంఐఎం సదాశివపేట పార్టీ అధ్యక్షులు గౌస్ పాషా ఆధ్వర్యంలో ఏఐఎంఐఎం పార్టీ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేకులు కట్ చేసి పార్టీ శ్రేణులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గౌస్ పాషా మాట్లాడుతూ.. నేటికి పార్టీ ఆవిర్భవించి 66 వసంతాల్లో అడుగుపెట్టిందని, ఆనాటి నుండి ఇప్పటివరకు ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కొరకు ప్రయత్నిస్తూ దేశంలో ఒక పటిష్ట రాజకీయ పార్టీగా బాధ్యతలు నిర్వహిస్తుందని మైనార్టీల దళితుల అణగారినప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు మెంట్ మరియు చట్టసభలలో ప్రజల పక్షాన నిలబడి వాటిని పరిష్కరిస్తూ ఏఐఎంఐఎం జాతీయ



అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ సేవలు మరువలేని అని కొనియాడారు. పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో వసీం అక్రమ్, రియాజుద్దీన్, జున్ను, వాజిద్, జాఫర్, హర్షద్, హుస్సేన్, షఫీ, మన్నాన్ ఖాన్, జోహార్, తదితర పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ పై చర్య తీసుకోవాలి

**కాంట్రాక్ట్ కార్మికుల జీతాల్లో కోత పెట్టడం దుర్మార్గం**

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల జీవో ప్రకారం 15 వేల 600 రూపాయలు ఇవ్వవలసి ఉంటుంది కానీ11 వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని , కార్మికుల జీతాల్లో కోత పెడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ సహకారంతోనే ఇదంతా జరుగుతుందని తక్షణమే వారిపై చర్య తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో గత అనేక సంవత్సరాల నుంచి కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు 15, 600 రూపాయలు ఇవ్వాలని జీవో విడుదల చేసింది కానీ సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం ఈ జీవో అమలు కావడం లేదు . ఇక్కడ మాత్రం 11 వేల రూపాయలు మాత్రమే కాంట్రాక్టు కార్మికులకు చెల్లిస్తున్నారు . గత రెండు సంవత్సరాల నుంచి కార్మికులకు ఇంత తక్కువ జీతం ఇస్తున్న ప్రభుత్వ సూపరిండెంట్ మాత్రం చూచి చూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం ప్రతి కార్మికుని కి ప్రతినెల జీతం కోసం 15600 రూపాయలు వస్తున్న కార్మికులకు మాత్రం అది అందడం లేదన్నారు. మిగతా డబ్బులు ఎక్కడ పోతున్నాయో చెప్పవలసిన అవసరం అధికారులకు ఉందన్నారు. ప్రతిరోజు నిత్యం శ్రమ పడుతున్న కార్మికులు వారి జీతాల్లో కోత విధించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు



ఆయన సహకారంతోనే ఇదంతా జరుగుతుందని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు తక్షణమే కార్మికుల జీతాల్లో కోత పెట్టిన వారిపై వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తుంది కార్మికుల జీతాల్లో కోత పెట్టిన డబ్బులు ఎక్కడికి పోతున్నాయి ఎవరి హస్తం ఉందో జిల్లా అధికారులు స్పందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సోలార్ ప్యానెల్ ఎలా అప్లై చేసుకోవాలి...

**హైదరాబాద్ :** ఇటీవల ప్రకటించిన 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో, సబ్సిడీ ధరకే ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకోవడానికి మార్గం సుగమమైంది. ఈ కేంద్ర ప్రభుత్వ పథకాన్ని మీరు కూడా సద్వినియోగం చేసుకోవచ్చు. సబ్సిడీ తీసుకోవడంతో పాటు మీ ఇంటికి జీవితకాలం ఉచితంగా విద్యుత్ పొందొచ్చు.కొత్త రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్‌ను (పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన) తొలిసారిగా ఈ ఏడాది జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆ తర్వాత, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 01న లోక్‌సభలో బడ్జెట్‌ను సమర్పిస్తూ పథకం గురించి ప్రస్తావించారు. ఈ పథకం కింద, దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ పథకం వల్ల సామాన్యులు, ప్రభుత్వం రెండూ లబ్ధి పొందుతాయి. సాధారణ ప్రజలు తమ ఇళ్ల పైకప్పుపై సౌరశక్తితో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా, విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందుతారు. ప్రతి నెలా వేల రూపాయలు ఆదా అవుతాయి. సౌరశక్తి నుంచి మరింత ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా, విద్యుత్ అవసరాల్లో భారత్ స్వావలంబన సాధించగలుగుతుంది. అధికారిక ప్రకటన ప్రకారం, 1 కిలోవాట్ సోలార్ ప్యానెల్ సిస్టమ్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. 2 కిలోవాట్ల ప్యానల్‌కు రూ.60 వేలు సబ్సిడీ, 3 కిలోవాట్ల సోలార్ ప్యానల్ సిస్టమ్‌కు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.సబ్సిడీ పోను, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెచ్చించే అదనపు మొత్తాన్ని రుణం రూపంలో పొందొచ్చు. దీనిపై తక్కువ వడ్డీ తీసుకుంటారు. ఈ లోన్ కోసం సామాన్య ప్రజలు ఎలాంటి పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రకటన ప్రకారం, ఇంటి పైకప్పుపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాలను బిగించుకోవడానికి 7 శాతం వడ్డీ రేటుతో కొలేటరల్ ఫ్రీ లోన్ (తాకట్టు లేని రుణం) అందుబాటులో ఉంటుంది.

**సబ్సిడీ కోసం ఎలా దరఖాస్తు చేయాలి?**

ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ కోసం, విద్యుత్ పంపిణీ సంస్థ పేరు, కస్టమర్ నంబర్, మొబైల్, ఇ-మెయిల్ అవసరం. వినియోగదారు/కస్టమర్ నంబర్, మొబైల్ నంబర్ సాయంతో పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ కోసం దరఖాస్తు చేయడానికి ఫామ్‌ను ఎంచుకోండి. సమీక్ష తర్వాత, అర్హుడైన దరఖాస్తుదారుకు ఆమోదం లభిస్తుంది. ఆమోదం పొందిన తర్వాత, సంబంధిత డిస్కంలో నమోదు చేసుకున్న ఏదైనా విక్రేత నుంచి ప్యానెల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ప్యానెల్ ఇన్‌స్టలేషన్ తర్వాత, ప్లాంట్ వివరాలను సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోండి. నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత ఉ డిస్కమ్ తనిఖీ తర్వాత, పోర్టల్‌లో కమిషనింగ్ సర్టిఫికేట్ అందుబాటులో ఉంటుంది. సర్టిఫికేట్ వచ్చిన తర్వాత, బ్యాంక్ ఖాతా వివరాలు, క్యాన్సిల్ చేసిన చెక్‌తో సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోండి. 30 రోజుల్లోగా మీ బ్యాంక్ ఖాతాలోకి సబ్సిడీ మొత్తం క్రెడిట్ అవుతుంది.

# అధికారం అడ్డుపెట్టుకుని రూ.65 లక్షలు అవినీతి

**అదిలాబాద్ :** ఇందు కలదు.. అందు లేదు అన్నట్లు తయారైంది అవినీతి. ప్రభుత్వం వేతనాలు ఇస్తున్నా.. కొంతమంది సైడ్ ఇన్‌కమ్‌పైనే ఆధారపడుతున్నారు. ఇటీవలే గిరిజన ఆశ్రమ పాఠశాల అధికారిని లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడ్డారు. తాజాగా మరో మహిళా అధికారిని కూడా అక్రమాల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. చిన్న పిల్లలకు సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను దారి మళ్లించినందుకు 8 ఏళ్ల తర్వాత అరెస్ట్ చేశారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండలంలో 2015?16లో ఐసీడీఎస్ సీడీపీవోగా శ్రీదేవి పనిచేసింది. పిల్లల కోసం కేటాయించిన పాలు, పాలప్యాకెట్లను దారి మళ్లించినట్లు అప్పట్లోనే అధికారులు గుర్తించారు. శాఖాపరమైన విచారణ చేపట్టారు. 322 అంగన్‌వాడీ కేంద్రాల్లో గిరిజన పిల్లలకు సరఫరా చేయాల్సిన పాలు, పాల ప్యాకెట్లను ఆమె మంచిర్యాలలోని చాక్లెట్, ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు.దీంతో ఈ కుంభకోణం వెలికితీసే బాధ్యతను అధికారులు ఏసీబీకి అప్పటించారు. విచారణ జరిపిన ఏసీబీ అధికారులు అవకతవకలు నిజమే అని నిర్ధారించారు. పాలు, పాలప్యాకెట్లు దారి మళ్లించడం ద్వారా రూ.65.78 లక్షల అవినీతికి పాల్పడినట్లు ధ్రువీకరించారు. 2022లోనే విచారణ పూర్తి చేసిన ఏసీబీ శ్రీదేవి అరెస్ట్‌కు అనుమతి ఇవ్వాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరారు.అయితే సదరు అవినీతి అధికారికి నాటి బీఆర్ఎస్ పాలకులు బాసటగా నిలిచారు. అరెస్టుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో కేసులో పురోగతి ఆగిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలో శ్రీదేవి అరెస్టుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కుంభకోణంలో అప్పటి జిల్లా మంత్రి జోగు రామన్న ముఖ్య అనుచరుడి హస్తం ఉండడంతోనే నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్టుకు అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది.



http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



స్థానిక వార్తలు

## ప్రజల వద్దే 8,470 కోట్ల విలువైన 2వేల నోట్లు



చలామణిలో ఉన్న 2000 రూపాయల నోట్లలో 97.62 శాతం తిరిగి బ్యాంక్‌లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నాడు తెలిపింది. ఈ నోటును ఉపసంహరించుకుని 9 నెలలు దాటినప్పటికీ ఇంకా 8,470 కోట్ల విలువైన నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని ఆర్‌బీఐ తెలిపింది. 2వేల నోట్లు ఇప్పటికీ లీగల్ టెండర్‌గా కొనసాగుతుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ నోట్‌కు కేంద్ర బ్యాంక్ గత ఏడాది మే 19న ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడే నాటికి 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణిలో ఉన్నాయి. బ్యాంక్‌ల్లో నోట్ల మార్పిడి, డిపాజిట్‌కు ప్రజలకు తొలుత సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఇచ్చారు. అనంతరం అక్టోబర్ 7 వరకు గడువు పెంచారు. దీని తరువాత 19 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మాత్రమే స్వీకరిస్తున్నారు. ఆర్‌బీఐ కార్యాలయాల్లో నేరుగాకాని, పోస్ట్ ద్వారా పంపించి కాని 2000 రూపాయల నోట్లను మార్చుకోవచ్చు. ఫిబ్రవరి 29 నాటికి 97.62 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది.

## పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు మరో షాక్




పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు మరో షాక్ తగిలింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూ.5.49 కోట్ల జరిమానా విధించింది.మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ ఈ జరిమానా విధించినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఆన్‌లైన్ జూదం సహా అనేక అనైతిక కార్యకలాపాల విషయంలో కొన్ని సంస్థలకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నుంచి నిర్దిష్ట సమాచారాన్ని ఈ యూనిట్ అందుకుంది. ఆపై సమీక్ష నిర్వహించిన పేటీఎంపై భారీ మొత్తంలో జరిమానా విధించింది. చట్ట విరుద్ధమైన కార్యకలాపాల నుంచి వచ్చిన సొమ్మును ఆయా సంస్థలు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నిర్వహిస్తున్న బ్యాంకు ఖాతాల నుంచి మళ్లించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. "మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ ఫైనాన్షియల్ యూనిట్ రూ.5.49 కోట్ల పెనాల్టీ విధించింది" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఫిబ్రవరి 15నే ఎఫ్ఐయూ ఉత్తర్వులు వెలువరించింది. కొత్తగా డిపాజిట్లు స్వీకరించకుండా పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఇప్పటికే ఆంక్షలు విధించింది. ఆ గడువు మార్చి 15తో ముగియనుంది. ఈ క్రమంలోనే ఫైనాన్షియల్ యూనిట్ జరిమానా విధించడం గమనార్హం.

# టాటా సుమో సరికొత్తగా..




టాటా సుమో.. ఈ పేరు చెప్తే వివి వినాయక్ సినిమాల్లో గాల్లోకి లేచే వాహనాలు గుర్తుకొస్తాయి కదా.. ఆ వాహనానికి ఉన్న క్రేజ్ వల్లే తన సినిమాల్లో విరివిగా ఉపయోగించానని వినాయక్ పలుమార్లు చెప్పాడు కూడా. టాటా సుమో అంటే తెలియని వారు ఉండరు. అప్పట్లో పెద్దపెద్ద నాయకులు టాటా సుమోలోనే తిరిగేవారు. టాటా సుమోలో ప్రయాణించడానికి తమ రాజసానికి ప్రతీకలాగా భావించేవారు. టాటా కంపెనీ తయారుచేసిన ఉత్పత్తుల్లో సుమో మొదటి ఐదు స్థానాల్లో ఉంటుందంటే అతిశయోక్తి కాదు. వాస్తవానికి సుమో అనేది మన దేశానికి సంబంధించింది కాకపోయినప్పటికీ.. అది జపాన్ దేశానికి చెందిన ఆటోమొబైల్ ఉత్పత్తి అయినప్పటికీ.. టాటా కంపెనీ దానిని భారతీయులకు పరిచయం చేసింది. సరికొత్త వాహన అనుభూతిని అందించింది. ఇప్పుడంటే ఫార్చునర్, ఇంకా కొత్త కొత్త కార్లు రోడ్లమీద సవారి చేస్తున్నాయి గాని.. ఒకప్పుడు టాటా సుమో అంటే రాజసానికి నిదర్శనంగా ఉండేది. అయితే కాలాను క్రమంలో సుమో మరుగున పడిపోయింది. అప్పట్లో టాటా కంపెనీ నానో అనే కారణం తెరపైకి తీసుకువచ్చినప్పుడు.. దాని తయారీలో భాగంగా సుమోను పక్కన పెట్టిందని వార్తలు వినిపించాయి. ఇన్నాళ్లకు టాటా కంపెనీ వాహనదారులకు శుభవార్త చెప్పింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా సుమోను మార్కెట్లోకి తీసుకొస్తున్న ట్టు వివరించింది. 7 సీటర్ కెపాసిటీతో స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ ౹ాఖుం గా దీనిని టాటా కంపెనీ మార్చినట్టు తెలుస్తోంది. పూర్తి అధునాతన వాహనంగా టాటా కంపెనీ దీనిని రూపొందించింది. ఫ్రంట్ గ్రిల్, ఎక్కువ కాంతిని వెదజల్లే ఎల్ఈడి హెడ్ లాంప్ లు, పగటిపూట కూడా వెలిగే ఇంటిగ్రేటెడ్ రన్నింగ్ లైట్లను ఏర్పాటు చేసింది. స్టైలిష్ టెయిల్ లైట్ తో వాహనం వెనుక భాగాన్ని రూపొందించింది. క్యాబిన్ ను అత్యంత సౌకర్యవంతంగా రూపొందించింది. డ్రైవర్ కాక్ పిట్ లో ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్, ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే కు సపోర్ట్ చేసే పెద్ద టచ్ స్క్రీన్ ఏర్పాటు చేసింది. ఈ వాహనంలో మూడు వరుసల్లో ప్రయాణికులు కూర్చునే విధంగా సీట్లు ఉన్నాయి. లెగ్ రూమ్ కూడా విస్తారంగా ఉంది. హెడ్ రూమ్ అధునాతనంగా ఉంది. ఎంత దూరం వెళ్లినా సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించేలా టాటా కంపెనీ దీనిని రూపొందించింది. ప్రస్తుత మార్కెట్ అవసరాల దృష్ట్యా దీనిని స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ లాగా టాటా కంపెనీ మార్చింది. కొత్త నమూనాలో 176 బీ హెచ్ పీ పవర్, 350 ఎన్ఎం గరిష్ట టార్క్ విడుదల చేసే 2.0 సామర్థ్యం ఉన్న ఇంజన్ ఏర్పాటు చేసింది. మృదువైన సిక్స్ స్పీడ్ మాన్యువల్ గేర్ విధానం ఈ వాహనానికి ప్రత్యేక ఆకర్షణ. ఆటోమెటిక్ ట్రాన్స్ మిషన్ వల్ల వాహనాన్ని అత్యంత సులువుగా డ్రైవింగ్ చేయవచ్చు.

# అనంత్ అంబానీ పెళ్లి ఖర్చు అన్ని కోట్లా?



రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదువ ఉండదు. అలాగే శ్రీమంతుడు తలుచుకుంటే ఖర్చుకు లెక్క ఉండదు. ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద శ్రీమంతుడు, ఆసియా కుబేరుడు ముఖేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, కాబోయే కోడలు రాధికా మర్చంట్ పెళ్లి ఖర్చు కూడా ఆ సామెత తీరుగానే ఉండబోతోంది.. ఇప్పటికే అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ముందస్తు పెళ్లి వేడుకలు గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ప్రపంచం నలుమూలల నుంచి అతిరథ మహారథులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు హాజరయ్యారు. అంతర్జాతీయ స్థాయి కళాకారులు ముందస్తు పెళ్లి వేడుకల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. మూడు రోజులపాటు ఈ ముందస్తు పెళ్లి వేడుకలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి ముకేశ్ అంబానీ కని విని ఎరుగని స్థాయిలో ఏర్పాటు చేశారు. అతిథుల కోసం 2,500 రకాల వంటకాలను సిద్ధం చేశారు..ముందస్తు పెళ్లి వేడుకలే ఈ స్థాయిలో జరిగితే.. ఇక పెళ్లి వేడుకలు ఎలా జరుపుతారోననే చర్చ దేశవ్యాప్తంగా నడుస్తోంది. ముందస్తు పెళ్లి వేడుకలకే ముకేశ్ అంబానీ వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జామ్ నగర్ ప్రాంతంలో 12 ఆలయాలను నిర్మించారు. కొత్త రోడ్లు ఏర్పాటు చేశారు. అతిథుల కోసం అల్ట్రా లగ్జరీ టెంట్లు నిర్మించారు. అక్కడ సకల సౌకర్యాలు కల్పించారు. అతిథుల కోసం ప్రత్యేకంగా విమానాలు కూడా ఏర్పాటు చేశారు. అంతకుముందు వేలాదిమందికి అన్నదానం చేశారు. ఇలా కేవలం ముందస్తు పెళ్లి వేడుకలకే ముకేశ్ అంబానీ కుటుంబం వందల కోట్లు ఖర్చు చేసింది. మరి పెళ్లికి.. అక్కడికే వస్తున్నాం. ముకేశ్ అంబానీ ఇంట్లో అనంత్ అంబానీ చిన్నవాడు. ప్రస్తుత తరానికి సంబంధించి ఆయన ఇంట్లో జరిగే చివరి వేడుక ఇదే. ఈ వేడుకను అత్యంత ఘనంగా జరపాలని ముఖేష్ అంబానీ కుటుంబం నిర్ణయించింది. అందుకే ఈ వేడుకను జీవితాంతం గుర్తుండిపోయేలా చేయాలని ముకేశ్ అంబానీ సంకల్పించారు. ఈ క్రమంలో జూలైలో జరిగే అనంత్- రాధిక పెళ్లి కోసం ఏకంగా 1000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే అతిథుల కోసం ఖరీదైన బహుమతులు, ఆద్యంతం గుర్తుండిపోయేలా వంటకా లు, సకల సౌకర్యాలతో పెళ్లి వేడుక జరపనున్నట్టు తెలిసింది.

# ఫిలిఫ్స్ స్పిన్ మాయ..
# న్యూజిలాండ్ గెలుపు ఆశలన్నీ మిడిలార్డర్‌పైనే



వెల్లింగ్‌టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ పోరాడుతోంది. పార్ట్ టైమ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిఫ్స్ ఐదు వికెట్ల ప్రదర్శనకు రచిన్ రవీంద్ర(56 నాటౌట్) అర్థ సెంచరీ తోడవ్వడంతో మ్యాచ్‌పై పట్టు బిగించింది. మూడో రోజు ఫిలిఫ్స్ విజృంభణతో ఆస్ట్రేలియా 164 రన్స్‌కే ఆలౌటయ్యింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ మూడు వికెట్ల నష్టానికి 111 రన్స్ కొట్టింది. మూడో రోజు ఆట ముగిసే సరికి రచిన్, డారిల్ మిచెల్(12 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. ఇంకా న్యూజిలాండ్ విజయానికి 258 పరుగులు కావాలి. తొలి ఇన్నింగ్స్‌లో కామెరూన్ గ్రీన్ సెంచరీతో ఆస్ట్రేలియా 383 పరుగులు బాదింది. అనంతరం నాథన్ లియాన్ 4 వికెట్లు తీయడంతో కివీస్ 129 పరుగులకే కుప్పకూలింది. దాంతో, ఆసీస్‌కు 203 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా జట్టులో లియాన్ 40 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిడిలార్డర్‌ను కకావికలం చేసిన ఫిలిఫ్స్ కెరీర్‌లో మొదటిసారి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆసీస్‌ను తక్కువకే కట్టడి చేసిన న్యూజిలాండ్‌ను ఓపెనర్లు టామ్ లాథమ్(8), విల్ యంగ్(15)లు నిరాశపరిచారు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగిన విలియమ్సన్(9)ను లియాన్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత మార్ష్, రవీంద్రలు ఆచితూచి ఆడారు. నాలుగో వికెట్‌కు 52 పరుగుల జోడించి న్యూజిలాండ్‌ను గెలుపు దిశగా నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే.. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై నాలుగో రోజు కివీస్ బ్యాటర్లు నిలబడతారా? లేదా? అనేది చూడాలి.

## శ్రేయాస్ అయ్యర్‌పై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆగ్రహం..




**న్యూఢిల్లీ:** శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు లిస్టు నుంచి తప్పించిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశం వివాదాస్పదమవుతోంది. దేశవాళీ క్రికెట్‌లో ఆడేందుకు నిరాకరించడం వల్లే ఆ ఇద్దర్నీ తప్పించినట్లు కారణాలు తెలుస్తున్నాయి. రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడకుండా.. హార్దిక్ పాండ్యాతో కలిసి ఇషాన్ కిషన్ ఐపీఎల్ కోసం శిక్షణ తీసుకున్నాడు. మరో వైపు శ్రేయాస్ అయ్యర్ కూడా దేశవాళీ క్రికెట్ ఆడేందుకు నిరాకరించి ఐపీఎల్ పై దృష్టి పెట్టాడు. కేకేఆర్ జట్టుతో కలిసి అతను శిక్షణ తీసుకుంటున్నట్లు తెలిసింది.

అయితే ఈ అంశం పట్ల బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆగ్రహంగా ఉన్నారు. వెన్ను నొప్పి ఉన్నా.. ఐపీఎల్ క్యాంపుకు శ్రేయాస్ వెళ్లడాన్ని అగార్కర్ సీరియస్‌గా తీసుకున్నారు. కాంట్రాక్టు ప్లేయర్ల జాబితాను రిలీజ్ చేసేది బీసీసీఐ సెలక్టర్లే కావడం గమనార్హం. జాతీయ జట్టుకు ఆడని సమయంలో దేశవాళీ టోర్నీలో ఆడాలని క్రికెటర్లకు బీసీసీఐ తెలిపింది.

స్పోర్ట్స్

## యువరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు?



సాధారణంగా క్రికెట్లో ఎన్నో ఏళ్ల పాటు ఆటగాళ్లుగా సేవలు అందించిన ప్లేయర్లు ఇక రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కూడా అటు క్రికెట్ కి ఏదో ఒక విధంగా దగ్గరగా ఉండడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొంతమంది ఏకంగా కోచ్ గా అవతారం ఎత్తి తమ అనుభవంతో యువ ఆటగాళ్ల ప్రతిభను మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తే.. ఇంకొంతమంది ఇక వ్యాఖ్యతలుగా మారిపోయి తమ గాత్రంతో క్రికెట్ మ్యాచ్లను ఉత్కంఠ గా మార్చేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. ఇలా ఇప్పటివరకు ఎంతోమంది మాజీ క్రికెటర్లు కోచ్ లుగా లేదా వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన వారు ఉన్నారు అని చెప్పాలి. కానీ ఈ మధ్యకాలంలో మాత్రం మాజీ క్రికెటర్లు అందరూ కూడా ఇక ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ఉన్నారు ఏకంగా క్రికెట్కు ఎక్కడా సంబంధంలేని పాలిటిక్స్ వైపు అడుగులు వేస్తూ ఉన్నారు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే అటు భారత మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్బిజెపి తరఫున గత ఎంపీ ఎలక్షన్లలో పోటీ చేసి విజయం సాధించారు. అయితే మరికొన్ని రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో.. ఇక ఈసారి మరో మాజీ క్రికెటర్ కూడా ఇలాగే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ మాజీ క్రికెటర్ ఎవరో కాదు యువరాజ్ సింగ్. ఏకంగా పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి తరఫున ఎంపీగా పోటీ చేస్తున్నట్లు వార్తలు రాగా.. ఈ విషయంపై ఆయన స్వయంగా స్పందించారు. నేను పంజాబ్ లోని గురుదాస్పూర్ నుంచి పోటీ చేయడం లేదు. ప్రజలకు సేవ చేయడం పైన నాకు ఆసక్తి ఉంది. అయితే %ఎశీబఎవఝఅ% అనే ఫౌండేషన్ ద్వారా సేవను కొనసాగిస్తాను అంటూ యువరాజ్ సింగ్ చెప్పుకొచ్చాడు. అయితే ఇటీవల యువరాజ్ తన తల్లి శబ్నమ్ తో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలవడంతో ఇక యువరాజ్ పొలిటికల్ ఎంట్రీ పై వార్తలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఈ మాజీ ప్లేయర్ క్లారిటీ ఇవ్వడంతో ఇక ఈ వార్తలకి ఫుల్ స్టాప్ పడిపోతుంది అని చెప్పాలి.



# త్వరలోనే జై హనుమాన్ ఫస్ట్ లుక్

టాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం 'హనుమాన్'. తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించింది. ఇప్పటివరకు ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇదిలావుంటే ఈ సినిమా 50 రోజుల వేడుక నేడు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఇక ఈ వేడుకలో ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. ఈ మూవీని బ్లాక్ బస్టర్ చేసినందుకు ప్రేక్షకులను ధన్యవాదాలు తెలిపాడు. అలాగే 'హనుమాన్' సీక్వెల్ జై హనుమాన్ పై స్పందించాడు. జై హనుమాన్ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. ఈ సినిమాలో కూడా హనుమంతుడే హీరో. జై హనుమాన్ ఫస్ట్ లుక్‌ను త్వరలోనే రిలీజ్ చేయబోతున్నాం. హనుమాన్ సినిమా క్లైమాక్స్‌లో చివరి ఐదు నిమిషాలలో వచ్చే హై ఏదైతే ఉందో అదే ఊపు జై హనుమాన్ సినిమాలో రెండు గంటలు ఉంటుందని ప్రశాంత్ వర్మ వెల్లడించాడు. కాగా ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'రాముడికి హనుమంతుడు ఇచ్చిన మాట ఏమిటి?' అన్న స్టోరీతో హనుమాన్' సీక్వెల్ జై హనుమాన్ సినిమా వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో హనుమంతుడిగా కనిపించబోయేది ఎవరంటూ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్నారు. ఇక ఈ సినిమా 2025లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆ విషయంలో గర్వపడుతుంటా!

దక్షిణాదిలో అగ్ర కథానాయికగా వెలుగొందిన ప్రియమణి బాలీవుడ్‌లోనూ తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆమె నటించిన చిత్రం 'ఆర్టికల్ 370' విడుదలైంది. ఆదిత్య సుహాస్ తెరకెక్కించిన ఈ సినిమాలో యామీ గౌతమ్‌తోపాటు ప్రధాన పాత్ర పోషించారు. సంచలనాలు, వివాదాలకు కేంద్రబిందువులా మారిన ఈ సినిమాలో ప్రియమణి నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన విషయాలివి. 'ఆర్టికల్ 370'ని కొందరు రాజకీయ ప్రచారం కోసం మలిచిన సినిమా అంటున్నారు. మరికొందరు జనాల్లో చైతన్యం తీసుకొస్తున్న చిత్రంగా అభివర్ణిస్తున్నారు. ఎవరి అభిప్రాయాలు వారికుంటాయి. కానీ ఈ చిత్రం కేవలం వాస్తవిక సంఘటనల ఆధారంగానే తెరకెక్కింది. మేం ఆర్టికల్ 370 వెనక ఉన్న చరిత్ర, వాస్తవాలు, జరిగిన సంఘటనలు తెలియజెప్పాం. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అనేది ప్రభుత్వం తీసుకున్న ఓ సాహసోతమైన నిర్ణయం. సాధారణంగా ఇలాంటివి అమలు సందర్భాల్లో తీవ్ర ఘర్షణలు చెలరేగుతుంటాయి. ఎన్నో ప్రాణాలు పోతుంటాయి. అదృష్టవశాత్తు అలాంటి అల్లకల్లోలం చెలరేగలేదు. ఒక్క ప్రాణమూ పోలేదు. ఈ విషయంలో నేను గర్వపడుతుంటా. వాస్తవానికి ఈ సినిమా ఒప్పుకున్నప్పుడు.. నాకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 గురించి తెలియదు. కథలోని.. సున్నితత్వంపై పెద్దగా అవగాహన లేదు. అయితే చిత్రీకరణకు ముందే ఎన్నో లోతైన విషయాలు తెలుసుకున్నా. ఇందులో నేను ప్రధానమంత్రి కార్యాలయంలో పని చేసే ఓ కీలకమైన ఐఏఎస్ అధికారిణిగా నటించా. పాత్రల పరిధి, కథలో మార్పులుచేర్పుల.. విషయంలో ప్రతి సినిమాకి.. దర్శకుడు, నటీనటులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. కానీ 'ఆర్టికల్ 370' అలా కాదు. అచ్చంగా వాస్తవిక సంఘటన ఆధారంగానే తెరకెక్కించాలి. 370 ఆర్టికల్ రద్దు సమయంలో జరిగిన విషయాలే చూపించాలి. మేమూ అదే చేశాం. ఇది కొందరికి నచ్చలేదనుకుంటా. కానీ మా అంతిమ లక్ష్యం జనాన్ని చైతన్యం చేయడమే.



# నక్షత్రాలను ఏకం చేస్తున్న కల్కి

'కల్కి 2898 ఏడీ' సినిమా విషయంలో ఎప్పటికప్పుడు క్రేజీ అప్‌డేట్లు వస్తూనే ఉన్నాయి. రీసెంట్‌గా స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రా ఈ సినిమా గురించి మాట్లాడారు. 'ఇప్పటివరకూ తెలుగులో ఇలాంటి కథతో సినిమా రాలేదు. ఇది పాన్ ఇండియా సినిమా కాదు.. పాన్ వరల్డ్ సినిమా. ఇండియన్ టాప్‌స్టార్స్ అయిన అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్‌లకు మాటలు రాసే అదృష్టాన్ని నాకు ఇచ్చింది ఈ సినిమా' అని చెప్పారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఇందులో కథానాయికగా దీపిక పదుకోన్ నటిస్తున్న విషయం తెలిసిందే. అలాగే దుల్కర్ సల్మాన్, పశుపతి, దిశాపటానీ ఇలా పెద్ద పెద్ద స్టార్లు ఇందులో భాగం అయ్యారు. నటకిరీటి రాజేంద్రప్రసాద్ కూడా ఇందులో ఓ కీలక పాత్ర పోషించారనేది తాజా వార్త. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. 'సినిమా నిర్మాణాల్లో చాలా మార్పులు వచ్చాయి. వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారు. ఆ అంకెలు వింటేనే భయమేస్తుంది. తాజాగా ప్రభాస్ 'కల్కి' సినిమాలో నటించాను. అలాగే మహేశ్‌బాబుతో కూడా ఓ సినిమా చేస్తున్నాను' అని తెలిపారు రాజేంద్రుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మే 9న సినిమా విడుదల కానుంది. ఈ లోపు ఇంకెంతమంది ఈ ప్రాజెక్ట్‌లో చేరతారో చూడాలి.



# సంగీత దర్శకుడి సరసన శివాని రాజశేఖర్!

తనకంటూ ఒక ప్రత్యేక స్టైల్ ఏర్పరచుకున్న దర్శకుడు పా.రంజిత్. ఆయన చిత్రాల్లో సామాజిక దృక్ప థం స్పష్టంగా కనిపిస్తుంది. సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూనే కమర్షియల్ అంశాలు యాడ్ చేస్తూ చిత్రాలు రూపొందించడంలో ఆయనను మించినవారు ఉండరు.ఒకవైపు దర్శకుడిగా రాణిస్తూనే నీలం ప్రొడక్షన్స్ పేరుతో చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి.. తన శిష్యులకు దర్శకత్వం వహించే అవకాశాన్ని కల్పిస్తూ వైవిధ్యమైన కథాచిత్రాలను నిర్మిస్తున్నా రు. ఇంతకుముందు దర్శకుడు మారి సెల్వరాజ్ వంటి సక్సెస్ ఫుల్ దర్శకులను పరిచయం చేశారు.తాజాగా తన మరో శిష్యుడు అకిరన్ మోసెస్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ నూతన చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం గురువారం చైన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో అతనికి జంటగా టాలీవుడ్ హీరోయిన్ శివానీ రాజశేఖర్ నటిస్తున్నారు. శ్రీనాథ్ బాజీ, లింగేష్, విశ్వంత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ముఖ్యంగా దర్శకుడు పా.రంజిత్ నిర్మిస్తున్నారంటే ఆ చిత్రానికి కచ్చితంగా ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే ఆయన రూపొందిస్తున్న చిత్రంలో జీవీ ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించడం మరో విశేషం. వీరి కాంబోలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. దీనికి సంబంధించి కథ, తదితర వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ కథానాయకుడిగా నటించిన తంగలాన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది.




# మళ్లీ నవ్వించేందుకు వస్తున్న 'సేవ్ ది టైగర్స్'

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్ వేదికగా వచ్చిన 'సేవ్ ది టైగర్స్' అనే తెలుగు వెబ్ సిరీస్ ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సిరీస్ మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ సిరీస్ సీజన్ 2 రాబోతుంది. తేజ కాకుమాను దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ, పావని, జోర్దార్ సుజాత, దేవయానిలు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ చేసింది. ఈ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్‌కు కొనసాగింపుగా వస్తున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఇక భార్యభర్తల మధ్య జరిగే భిన్నమైన కథల ఆంథాలజీ ఇతివృత్తంగా ఈ సిరీస్‌ను మేకర్స్ రూపొందించారు. మహి వి. రాఘవ్, చిన్నా వాసుదేవరెడ్డి నిర్మించిన ఈ వెబ్ సిరీస్ మార్చి 15 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com